PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 22 | విజయవాడ, మంగళవారం 22 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 22 August 2023 | Rs

AADHAAR

నేటి నుంచి నాలుగు రోజులు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

• లోపలి పేజీలో.. •

జాబిల్లికి ఆవలవైపు...



- చిత్రాలు విడుదల చేసిన ఇస్రో
- చంద్రయాన్-2 ఆర్బిటర్‌తో చంద్రయాన్-3 ల్యాండర్‌కు కమ్యూనికేషన్

• లోపలి పేజీలో.. •

ఆర్డినెన్స్‌తో జిపిఎస్

దసరాకు ఒక పెండింగ్ డిఎ	వైద్యశాఖలో మహిళా ఉద్యోగులకు 5రోజులు అదనపు క్యాజువల్ లీవ్‌లు	ఎపి ఎన్‌జిఓ 21వ మహాసభలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిపిఎస్ (గ్యారంటీ పెన్షన్ స్కీమ్) అమలు కోసం ఆర్డినెన్స్‌ను జారీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎపి నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సభలో సిఎం మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లోనే జిపిఎస్ ఆర్డినెన్స్ జారీ అవుతుందన్నారు. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డిఎ ఇవ్వనున్నట్లు చెప్పారు. రెండు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో జులై 2022వ సంవత్సరానికి సంబంధించిన డిఎను విడుదల చేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు, మిగిలిన శాఖల్లో అమలవుతున్న విధంగా ఐదు రోజులు అదనపు క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ విషయాన్ని ప్రస్తావించిన ఆయన సిపిఎస్ సమస్యను పరిష్కరించేందుకు ఎంతో మనసు పెట్టి నిజాయితీగా కృషి చేసినట్లు చెప్పారు. ఏడాదిన్నర సమయం అనేక అధ్యయనాలు చేసిన తర్వాత, శాశ్వత పరిష్కారం చూపాలని ఫ్రెండ్లీ గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకొచ్చామన్నారు. ప్రభుత్వం మీద అధిక బరువు పడకుండా, భవిష్యత్తులో ప్రభుత్వాలు చేతులెత్తే పరిస్థితులు రాకుండా ఉండేలా రూపొందించినట్లు చెప్పారు. మాట తప్పే ఉద్దేశ్యముంటే అమలు చేయడం సాధ్యం కాదని చెప్పి తప్పించుకునే వాళ్లమన్నారు. రాబోయే రోజుల్లో దేశం మొత్తం మీద ఇదే విధానం అమలు చేస్తారన్నారు. . స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఉద్యోగులు మన రాష్ట్రంలో 3.97లక్షల మంది ఉండగా, 2019 నుంచి తమ నాలుగున్నరేళ్ల పాలనలో 2,06,638 లక్షలమందికి శాశ్వత ఉద్యోగాలిచ్చామన్నారు. ప్రభుత్వ డెలివరి సిస్టమ్‌లో బలపడాలనే ఉద్దేశ్యంతో గ్రామ సచివాలయ



ఎపి నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులర్ చేసే విషయంలో ముందు ఐదు సంవత్సరాలు ఇస్తే సరిపోతుందని అనుకున్నా మని, జిల్లా పర్యటనలు మొదలు పెట్టిన తర్వాత వచ్చే వినతుల దృష్ట్యా 2014 వరకు పరిగణలోకి తీసుకుని క్యాబినెట్‌లో పెట్టి వారిని రెగ్యులర్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచామన్నారు. కోవిడ్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పడిపోయినా ఉద్యోగులకు వేతనాలు, పేదలకు డిబిటి ద్వారా సంక్షేమ పథకాలు అందించామని సిఎం తెలిపారు. ఎపి ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని జిల్లాల్లో పనిచేసే ఉద్యోగులకు సమానంగా 16శాతం హెచ్‌ఆర్‌ఎ తీసుకొచ్చారన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను రూపొందించడంతో పాటు ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను ఇవ్వాలని, వైద్య ఆరోగ్యశాఖలోని మహిళా ఉద్యోగులకు ఐదు రోజులు అడిషనల్ సెలవులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందైనా ఐఆర్ ప్రకటిస్తారనే నమ్మకం ఉద్యోగుల్లో ఉందని, జిపిఎస్ విధానానికి తాము ఆమోదం తెలిపినప్పటికీ కాంట్రిబ్యూషన్ లేని పెన్షన్ విధానాన్ని ఉద్యోగులు కోరుకుంటున్నట్లు బండి వెల్లడించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఎంతో కొంత జీతాలు పెంచాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ఉద్యోగులు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు చంద్రశేఖర్‌రెడ్డి (ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం), మంత్రులు ఆదిమూలపు సురేష్, తానేటి వనిత, విజయవాడ సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు వైసిపి ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎపి ఎన్‌జిఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డి తోపాటు పలువురు యూనియన్ నేతలు పాల్గొన్నారు.

గుజరాత్ హైకోర్టులో ఏం జరుగుతోంది ?



- సుప్రీం ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేస్తారా?
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సుప్రీం బెంచ్
- బాధితురాలి అబార్షన్‌కు అనుమతి

న్యూఢిల్లీ : తన 27వారాల గర్భాన్ని తొలగించుకోవడానికి అనుమతి కోరుతూ అత్యాచార బాధితురాలు పెట్టుకున్న పిటిషన్‌పై గుజరాత్ హైకోర్టు వ్యవహరించిన తీరు పట్ల సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసింది. ఈ కేసు విషయంలో తమ ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎలా వ్యవహరిస్తారంటూ గుజరాత్ హైకోర్టును ప్రశ్నించింది. బాధిత మహిళ మానసిక వేదన, వైద్య నివేదికలను పరిగణనలోకి తీసుకుని ఆమె తన 27 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. సోమవారం సుప్రీంకోర్టు ధర్మాసనం సమావేశమైన వెంటనే, గుజరాత్ హైకోర్టు ఈ కేసును తనకు తానుగా పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టి, ఆ మహిళ పిటిషన్‌ను కొట్టివేసిందని న్యాయవాదులు తెలియజేశారు. దానిపై జస్టిస్ నాగరత్న, జస్టిస్ భుయాన్‌లతో కూడిన బెంచ్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. తోసిపుచ్చిన పిటిషన్‌ను తిరిగి విచారణకు స్వీకరించాల్సిన అవసరమేం వచ్చిందని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. అది కూడా సుప్రీం విచారణ ముగిసిన వెంటనే ఎందుకు చేపట్టాల్సి వచ్చిందన్నారు. "అసలు గుజరాత్ హైకోర్టులో ఏం జరుగుతోంది? అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులకు వ్యతిరేకంగా దేశంలో ఏ న్యాయస్థానమూ కూడా ఆదేశాలు జారీ చేయరాదు. ఇది రాజ్యాంగ సూత్రాలకే విరుద్ధం" అని నాగరత్న వ్యాఖ్యానించారు. తొలుత బాధితురాలి పిటిషన్‌ను విచారించేందుకు శనివారం ప్రత్యేకంగా సమావేశమైన సుప్రీం కోర్టు బెంచ్, గుజరాత్ హైకోర్టు తీరును తప్పుబట్టింది. అబార్షన్ కోసం ఆమె చేస్తున్న పోరాటాన్ని పట్టించుకోకుండా 12రోజుల పాటు కేసును వాయిదా వేయడాన్ని ప్రశ్నించింది. విలువైన సమయాన్ని ఎందుకు వృధా చేశారని ప్రశ్నించింది. తక్షణమే ఆమెకు వైద్య పరీక్షలు జరపాల్సిందిగా ఆదేశించింది. తదుపరి విచారణకు సోమవారానికి కేసును వాయిదా వేసింది. శనివారం సుప్రీం విచారణ ముగిసిన వెంటనే సమావేశమైన గుజరాత్ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. పైగా తన బిడ్డ ప్రభుత్వ సంరక్షణలో పెరగడానికి ఆమె సుముఖంగా వుందా? లేదా? అన్న అభిప్రాయం తెలుసుకునేందుకే ఈ కేసును వాయిదా వేశారంటూ వివరణ ఇచ్చారని న్యాయవాదులు సుప్రీం బెంచ్‌కు తెలియజేశారు. ఆ విషయమై బెంచ్ మరింత కలత చెందింది. అత్యాచార బాధితురాలిపై ఇటువంటి అన్యాయమైన షరతులను కొనసాగించరాదని జస్టిస్ భుయాన్ వ్యాఖ్యానించారు.

అత్యాచారం వల్ల గర్భం దాల్చడం మాన్పలేని గాయం !

అత్యాచారం వల్ల గర్భం దాల్చాల్సి రావడం బాధితురాలికి కోలుకోలేని గాయం వంటిదేనని, అది తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. " వివాహ వ్యవస్థలో ఒక మహిళ తల్లవడం అనేది అందరికీ అత్యంత సంతోషకరమైన విషయమే కానీ, వివాహ బంధానికి వెలుపల తన సమ్మతి లేకుండా ఇలా గర్భం దాల్చడం అనేది ఆ మహిళ శారీరక, మానసిక ఆరోగ్యానికి అత్యంత హానికరం. లైంగిక దాడిని ఎదుర్కోవడమే అత్యంత బాధాకరమంటే, దాని ఫలితంగా గర్భం దాల్చడమన్నది కోలుకోలేని గాయమే అవుతుంది" అని బెంచ్ వ్యాఖ్యానించింది. బాధితురాలు మంగళవారమే ఆసుపత్రిలో చేరాలని ఆదేశించింది. అబార్షన్ సమయంలో పిండం సజీవంగా వున్నట్టైతే వెంటనే ఇంక్యుబేషన్‌లో పెట్టి సంరక్షించాలని సూచించింది. ఆ తర్వాత చట్టప్రకారం ఆ చిన్నారి సంరక్షణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలని ఆదేశించింది.

క్రమంగా పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 25 అడుగుల నీటిమట్టం
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 2.2 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రంతో పాటూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మళ్లీ గోదావరికి వరద తాకిడి తగిలింది. భద్రాచలం వద్ద సోమవారం నాటికి 25.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. దేవిపట్నంలోని గండి పోశమ్మ ఆలయంలోకి వరద నీరు నిల్చే ఉండడంతో రెండో రోజూ యాత్రికుల రాకపోకలను అధికారులు నిలిపేశారు. వరద ఉధృతి ఈ నెల 27 వరకూ ఉంటుందని సిడబ్ల్యుసి అధికారులు అంచనా వేస్తున్నారు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం రాత్రి ఎనిమిది గంటలకు 7.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఈ బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 2.25 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి, తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 11,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కొనసాగడంతో ఉధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రాజమండ్రిలో భారీ వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రాజమహేంద్రవరంలో కురిసిన భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కోనసీమ జిల్లా అమలాపురం, అంబాజీపేట, పి.గన్నవరం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లో భారీ వర్షం పడింది. ఇటుక బట్టీల్లోకి మోకాల్లోతు నీరు చేరింది. కాకినాడ జిల్లాలో పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, సామర్లకోట, పిఠాపురం, యు.కొత్తపల్లిలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. యు.కొత్తపల్లిలో ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది.

మణిపూర్‌లో పరిస్థితి దయనీయం



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- వివాదాల పరిష్కారానికి సంప్రదింపులు వెంటనే ప్రారంభించాలి
- మూడున్నర నెలలైనా ఇప్పటికీ ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు
- మీడియాతో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో హింసను అరికట్టేందుకు నిర్మాణాత్మక చర్యలు లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఘోరంగా విఫలమయ్యాయని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. నలుగురు సభ్యులతో కూడిన సిపిఎం బృందం మూడు రోజుల మణిపూర్ పర్యటన ఆదివారంతో ముగిసింది. బృందానికి నాయకత్వం వహించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీకి చేరుకుని, సోమవారం సిపిఎం కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్) వద్ద మీడియాతో మాట్లాడారు. మణిపూర్‌లో పరిస్థితి చాలా దుర్భరంగా ఉందని అన్నారు. హింస కొనసాగుతోందని, అయితే ఈ విపత్కర పరిస్థితిని అధిగమించేందుకు ఏం చేయాలో రాష్ట్రప్రభుత్వం చేయలేదని విమర్శించారు. తాము అక్కడ ఉన్నప్పుడే మరో దాడి జరిగిందని, మరో ముగ్గురు వ్యక్తులు చనిపోయారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక చేయలేదని తమకు అర్థమైందన్నారు. సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు తమ సహకారాన్ని అందిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామన్నారు. రెండు గ్రూపుల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలను ప్రారంభించాలని, చర్చలొక్కటే మణిపూర్ సమస్యకు పరిష్కార మార్గమని అన్నారు. సంప్రదింపుల ప్రక్రియ నిర్వహించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. అలాగే అన్ని వర్గాల ప్రజల ప్రతినిధులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అప్పుడే ఒక అవగాహనకు రావచ్చని తెలిపారు. హింస, అల్లర్లు కొనసాగి మూడున్నర నెలలు కావస్తున్నా ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శించారు. అక్కడి ఘటనలు అమానవీయంగా ఉన్నాయని, కొన్ని చూడలేని పరిస్థితిలో నెలకొన్నాయని తెలిపారు. మణిపూర్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మణిపూర్ గవర్నర్‌తో భేటీ అయ్యామని, అలాగే పది లౌకిక ప్రతిపక్ష పార్టీల నేతలను కలిశామని తెలిపారు. వారితో చర్చించామని పేర్కొన్నారు. వివిధ వర్గాల పౌర సమాజ ఉద్యమ నేతలను కలిశామని, రెండు వర్గాల బాధితులుండే సహాయక శిబిరాలను సందర్శించామని చెప్పారు. మణిపూర్ పర్యటనపై రిపోర్టు తయారుచేసి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు.

రాజ్యాంగ సంక్షోభం ముంగిట మణిపూర్?

- కేబినెట్ సిఫార్సును పట్టించుకోని గవర్నర్
- జరగని అసెంబ్లీ ప్రత్యేక సమావేశం
- సుప్రీంకు గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులు

• లోపలి పేజీలో.. •

ఛత్తీస్‌గఢ్‌లో 40 మంది కిడ్నాప్

- 31 మంది విడుదల
- మావోయిస్టుల వద్ద బందీలుగా తొమ్మిదిమంది

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు 40 మందిని కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత వారిలో 31 మందిని విడుదల చేశారు. మావోయిస్టుల చేతుల్లో ఇంకా తొమ్మిది మంది బందీలుగా ఉన్నారు. కిడ్నాప్ అయిన వారిలో పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.... పర్సేగఢ్ పోలీస్ స్టేషన్ పరిధి కుట్రూ అటవీ ప్రాంతంలోని చీకటిరాజ్ గుట్టలపై ఉన్న ఆదివాసీ వన దేవతలకు పూజలు చేసేందుకు సమీప ప్రాంతాల నుంచి 40 మంది వెళ్లారు. ఆ సమయంలో వారిని మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. ఈ విషయం తెలిసి తమ వారిని వదిలేయాలని మావోయిస్టులను వారి కుటుంబసభ్యులు వేడుకున్నారు. ఈ నేపథ్యంలో కుట్రూ గ్రామ మాజీ సర్పంచ్ మహేష్ కుమార్ గోటా సహా తొమ్మిది మందిని మావోయిస్టులు తమ వద్ద ఉంచుకుని మిగిలిన వారిని విడిచిపెట్టారు. పోలీసులు అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. మావోయిస్టులు ఎందుకు కిడ్నాప్ చేశారు? వారి డిమాండ్లు ఏంటి? అనేది తెలిసిరాలేదు.



బిఆర్‌ఎస్ తొలి జాబితా విడుదల

- గజ్వేల్, కామారెడ్డి నుంచి కెసిఆర్ పోటీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అధికార భారత్ రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) శాసనసభ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాను బిఆర్‌ఎస్ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కెసిఆర్ సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రకటించారు. కేవలం ఏడు స్థానాలు మినహా సిట్టింగ్ అభ్యర్థులకే మళ్లీ అవకాశం దక్కింది. ముఖ్యమంత్రి కెసిఆర్ ఈసారి కామారెడ్డి, గజ్వేల్ నుంచి బరిలోకి దిగనున్నారు. నర్సాపూర్, నాంపల్లి, జనగామ, గోషామహల్ స్థానాలకు అభ్యర్థులను ప్రస్తుతానికి వెల్లడించలేదు. త్వరలో వాటిని ఖరారు చేస్తామని కెసిఆర్ తెలిపారు. ఉప్పల్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, వైరా, వేములవాడ స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించారు. వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వం కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో అక్కడ అభ్యర్థిని మార్చాల్సి వచ్చిందని కెసిఆర్ తెలిపారు. కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభ్యర్థన మేరకు ఆయన కుమారుడు డాక్టర్ సంజయ్‌కు అవకాశమిచ్చామన్నారు. ఉప్పల్ మినహా సిట్టింగ్‌లను మార్చిన మిగిలిన నాలుగు ఎస్‌టి రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు. ఎంఐఎం, బిఆర్‌ఎస్ పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందని, భవిష్యత్‌లోనూ ఈ స్నేహం కొనసాగుతుందని, అక్టోబరు 16న వరంగల్‌లో జరిగే సింహగర్జన సభలో బిఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రకటిస్తామని కెసిఆర్ తెలిపారు.

22 జిల్లాల్లో వర్షాభావం

ఇలాగే ఉంటే తాగునీటికి కటకటే

- వర్షాభావంతో వట్టిపోయిన చెరువులు
- ఖాళీగానే సాగునీటి ప్రాజెక్టులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 22 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నాలుగు జిల్లాల్లో మాత్రమే సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. పార్వతీపురం, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం వుంది. ఈ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టు నెల చివరకు వచ్చినా రాష్ట్రమంతటా వర్షాభావ పరిస్థితులతో చెరువులు దాదాపు ఖాళీ అవుతున్నాయి.

ప్రధాన ప్రాజెక్టుల్లోకి నీరు చేరడం లేదు. దీంతో ఈ ఏడాది వ్యవసాయంతో పాటు, తాగునీటికి ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 44శాతం లోటు వుంటే ఆతర్వాత కడప జిల్లాలో 42శాతం, అన్నమయ్య, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 39శాతం, నెల్లూరులో 37శాతం లోటు వర్షపాతం నమోదయ్యింది. రాష్ట్ర సగటు 26శాతం తక్కువ వర్షపాతం వుండటంతో ఈ ప్రభావం సాగునీటికే కాదు ప్రజలకు, పశువులకు తాగునీటి వనరులుగా వున్న చెరువులు బోసిపోయిన పరిస్థితి వుంది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న చెరువుల్లో ఇప్పటిదాకా కేవలం 48శాతం నీరు మాత్రమే చేరింది. చెరువుల్లో 52శాతం నీటి లభ్యత తక్కువగా వుంది. అలాగే ప్రధాన ప్రాజెక్టులు అయిన శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టు, సోమశిల ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆందోళనకరంగా వుంది. గత ఏడాది శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు పూర్తిస్థాయి సామర్థ్యంతో కళకళగా వున్న పరిస్థితి వుంటే ఈ ఏడాది డెడ్ స్టోరేజ్ స్థాయిలకు మించి నీటిమట్టాలు పెరగని పరిస్థితి. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 215 టిఎంసీలు కాగా ప్రస్తుతం 105 టిఎంసీలు మాత్రమే వుంది. నాగార్జునసాగర్ 312 టీఎంసీలకు గాను 151 టిఎంసీలు మాత్రమే వుంది. నెల్లూరు జిల్లాలోని సోమశిల 78 టిఎంసీలకు గాను 19.7 టిఎంసీలు, కండలేరులో 68 టిఎంసీలకు గాను 15.2 టిఎంసీలు, పల్నాడు జిల్లాలోని పులిచింతల రిజర్వాయర్‌లో 45.7 టిఎంసీలకు గాను 25టిఎంసీలు మాత్రమే వున్నాయి. కడపజిల్లాలోని గండికోట రిజర్వాయర్‌లో మాత్రము 26.8టిఎంసీలకు గాను 19.39 టిఎంసీలు వున్నాయి.

బ్రహ్మంసాగర్‌లో 17.7టిఎంసీలకు గాను 8.4 టిఎంసీలు వుంది. అలాగే నంద్యాల జిల్లాలోని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 16.9 టిఎంసీలు కాగా ఇపుడు 6.9 టిఎంసీలు మాత్రమే వున్నాయి. అలాగే గోరుకల్లు రిజర్వాయర్‌లో 12.44టిఎంసీలకు గాను 4.7 టిఎంసీలు, అవుకులో 4.1కుగాను 1.2 టిఎంసిలు, కర్నూలు జిల్లాలోని గాజులదిన్నె ప్రాజెక్టులో 4.5టిఎంసీలకు గాను 1.1 టిఎంసీలు, సత్యసాయి జిల్లాలోని పిఎబిఆర్‌లో 11.1 టిఎంసీలకు గాను 2.4టిఎంసీలు, అనకాపల్లిలోని తాండవ రిజర్వాయర్‌లో 4.9 టిఎంసీలకుగాను 2.9 టిఎంసీలు మాత్రమే వుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తక్కువగా వుండటం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాభావ పరిస్థితులకు తోడు చెరువులు, సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిలభ్యత లేకపోవడంతో భూగర్భ జలమట్టాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మార్గదర్శిలో సోదాలు చేయొద్దు

- హైకోర్టు మౌఖిక ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి

మార్గదర్శి చిట్ ఫండ్ బ్రాంచుల్లో సోదాలు నిర్వహించరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే వరకు సోదాలు నిర్వహించొద్దని జస్టిస్ ఎన్ జయసూర్య సోమవారం సిఐడికి, రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేశారు. సోదాలు చేయాల్సి వస్తే పని వేళల్లోనే చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిందని, అయితే సోదాలు చేసిన ఫొటోలను పరిశీలిస్తే ఆ తర్వాత కూడా సోదాలు చేసినట్లుగా అనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. మధ్యంతర ఉత్తర్వుల అభ్యర్థనపై ఉత్తర్వులను రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎపిలోని 37 మార్గదర్శి బ్రాంచుల్లో ఈ నెల 17 నుంచి సిఐడి ఇతర శాఖల అధికారులు సోదాలు చేయడాన్ని సవాల్ చేస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ తరపున పి రాజాజీ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సోమవారం హైకోర్టు విచారణ జరిపింది.

కీలక అంశాలపై 'బ్రిక్స్' దృష్టి

- నేటి నుంచి మూడు రోజుల పాటు శిఖరాగ్ర సదస్సు
- జోహానెస్‌బర్గ్‌కు తరలివస్తున్న అధినేతలు
- పలు విషయాలు, సమస్యలపై చర్చలు జరిగే అవకాశం

జోహానెస్‌బర్గ్ : బ్రిక్స్ దేశాల 15వ శిఖరాగ్ర సమావేశం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ జరగనున్నాయి. ఈ సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా తరలివస్తున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ ఆన్‌లైన్ ద్వారా ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఎనిమిదేళ్ల తరువాత బ్రిక్స్ కూటమి అధినేతలంతా తొలిసారి కలవనున్నారు. ప్రపంచాన్నే వణికించిన కోవిడ్ మహమ్మారి బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు బ్రేక్ వేసింది. మంగళవారం ఉదయం జోహానెస్‌బర్గ్‌కు బయల్దేరనున్న మోడీ బ్రిక్స్ సమావేశాల సందర్భంగా జిన్‌పింగ్‌తో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఏకధ్రువ ప్రపంచం స్థానే బహుళ ధ్రువ ప్రపంచం బలపడుతున్న ఈ తరుణంలో బ్రిక్స్ కూటమి దేశాలు తమ మధ్య బంధాన్ని మరింత పటిష్టపరచుకునే దిశగా కదలాలి. ఈ శిఖరాగ్రసదస్సు నేడు ప్రపంచ దృష్టిని విశేషంగా ఆకర్షించడానికి ఇదొక ముఖ్య కారణం.

జి-7 దేశాలను అధిగమించిన బ్రిక్స్ జిడిపి

ప్రపంచ ఆర్థిక నిర్వహణలో బ్రిక్స్ పలుకుబడి పెరుగుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అది గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నది. ప్రపంచ జిడిపిలో బ్రిక్స్ దేశాలు 31.5 శాతం వాటా కలిగి ఉండగా, జి-7 దేశాలు కేవలం 30.7 శాతం వాటాను కలిగివున్నాయి. కోవిడ్ మహమ్మారి అనంతర ప్రపంచంలో, ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం, పాశ్చాత్య ఆర్థిక ఆంక్షలు, అమెరికా, చైనా దేశాల మధ్య పెరిగిన విభేదాలు, రష్యాతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, స్విఫ్ట్ పరిమితులు, ఆర్థిక మాంద్యం వంటి కీలక అంశాలపై బ్రిక్స్ దృష్టి సారించాల్సిన అవసరముంది.

కొత్త సభ్యులు, బహుళ ధ్రువ ప్రపంచం, కొత్త కరెన్సీ పై చర్చకు అవకాశం

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఎన్‌డీబీ.. కొన్నిసార్లు బ్రిక్స్ బ్యాంక్ అని పిలుస్తారు) బ్రిక్స్ సాధించిన ఒక విజయమనే చెప్పాలి. అభివద్ధి చెందుతున్న దేశాలలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణ సాయం అందించడం ద్వారా ఈ దేశాల అభివృద్ధిలో ఎన్‌డిబి విశిష్ట పాత్ర పోషిస్తున్నది. అది క్రమంగా విస్తరిస్తూ, ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను సవాలు చేస్తున్నదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు, సుస్థిర అభివృద్ధికోసం వనరులను సమకూర్చడం మిగతా 5లో

నేటి నుంచి నాలుగు రోజులు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేషన్‌కు కావలసిన డాక్యుమెంట్లు, అప్లికేషన్ ఫీజు, దరఖాస్తు ఫారాలు, సొంతంగా ఉచితంగా డాక్యుమెంట్ చేసుకునే విధానాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. ఆధార్‌కు సంబంధించి సచివాలయాల్లో అందించే సేవలకు ఫీజులు కూడా ప్రభుత్వం వెల్లడించింది ఆధార్‌కు మొబైల్ నెంబరు లింక్‌కు రూ.50లు, ఆధార్‌కు ఇ మెయిల్ ఐడి లింక్‌కు రూ.50లు, బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫేజ్, ఐరిష్, బయోమెట్రిక్) సేవలకు రూ.100లు ఫీజుగా నిర్ణయించారు. పేరు మార్పు, పుట్టిన తేదీ మార్పు, జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, అడ్రస్ మార్పు సేవలకు రూ.50లుగా నిర్ణయించారు. కొత్తగా ఆధార్ నమోదు, బాల ఆధార్, తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (5-7, 15-17 సంవత్సరాలు) సేవలు ఉచితంగా అందుతాయని గ్రామ వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (7 నుంచి 12 సంవత్సరాలు దాటితే), మూడు లేదా అంతకన్నా ఎక్కువ సర్వీసులు చేసిన అటువంటి సేవలకు రూ.100లు సేవలుకు ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుందని ఆ శాఖ పేర్కొంది.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- బాలల హక్కుల పరిరక్షణ ఛైర్మన్ అప్పారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. సోమవారం విజయవాడ పడమటలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'యూత్ ఫర్ సేవ స్వచ్ఛంద సేవా సంస్థ' వారు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబరిచిన 15 మంది బాలికలను అభినందించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక బాలికలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు బాలలకు విద్య, వైద్య సేవల విషయంలో సహాయ, సహకారాలు అందించి వారిని నిరంతరం ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. రేణుక మాట్లాడుతూ.. బాలికల విద్యా ప్రమాణాలను పెంచుతూ వారికి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికలు వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ఎ అనూష తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సిఎంకు చిత్తశుద్ధి లేదు

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అబద్ధాలు, దుష్ప్రచారం తప్ప ఉద్యోగుల డిమండ్లు, సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు విమర్శించారు. ఎపిఎన్‌జిఒ మహాసభలకు హాజరైన జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు చేసింది చెప్పుకోకుండా అబద్ధాలు, దుష్ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడిపి హయాంలో ఉద్యోగుల జీత భత్యాల చెల్లింపులు, జగన్ ప్రభుత్వంలో చెల్లిస్తున్న చెల్లింపులపై వాస్తవాలతో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం సిఎంకు ఉందా? అని ప్రశ్నించారు. జిపిఎస్‌ను స్వాగతిస్తున్నామన్న ఎన్‌జిఒ నాయకులు బండి శ్రీనివాసరావు వ్యాఖ్యలు ఆత్మహత్యతో సమానమని విమర్శించారు.

సిఆర్‌పిలను రెగ్యులర్ చేయాలి : రామగోపాల్ రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న 3,500 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి)లను రెగ్యులర్ చేయాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కోరారు. వీరంతా టెట్‌లో అర్హత సాధించిన బిఎడ్ అభ్యర్థులని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య తెలంగాణలో సిఆర్‌పిలను పర్మినెంటు చేయాలని ఉద్యమం చేస్తున్నారని, ఎపిలో ఉన్నవారిపై ఎందుకు దృష్టి పెట్టరని ప్రశ్నించారు.

రూ. ఆరు వేలు పింఛను ఇవ్వండి

- జిల్లా కలెక్టరేట్ల వద్ద వికలాంగుల ధర్నాలు



అనకాపల్లిలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు అప్పలనాయుడు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

తమకు రూ.ఆరు వేలు పింఛను ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన సోమవారం విశాఖ, అనకాపల్లి, కృష్ణా, తిరుపతి, అనంతపురం జిల్లాల కలెక్టరేట్ల వద్ద వికలాంగులు ధర్నాలు నిర్వహించారు. తమపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. అనకాపల్లిలో తొలుత ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట, ఆ తరువాత జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయా చోట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పలనాయుడు మాట్లాడుతూ.. నేడు అన్ని రకాల ధరలూ పెరిగాయని, కరెంట్ ఛార్జీలు, పన్నుల భారాలూ రెట్టింపయ్యాయని, ఈ క్రమంలో వికలాంగులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.మూడు వేలు పింఛను ఏ మాలకూ రావడం లేదని అన్నారు. లక్షలాది మంది వికలాంగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ బటన్ నొక్కి డబ్బులు వేస్తున్నారని, వికలాంగులనూ బటన్ నొక్కి ఆదుకోవాలని కోరారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వికలాంగుల పథకాలను ఎలా ఎత్తివేశారో వివరించారు. సబ్సిడీ రుణాలు అందడం లేదని, అంత్యోదయ కార్డులు మంజూరు కావడం లేదని తెలిపారు. వికలాంగుల చట్టం - 2016ను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రామయ్య మాట్లాడారు. అన్ని రంగాల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కృష్ణా జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ఎస్.నారాయణ మాట్లాడుతూ.. అర్హులైన వికలాంగులందరికీ త్రీ వీలర్ మోటారు వాహనాలను, ఇతర ఉపకరణాలను అందజేయాలని కోరారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో పాల వెంకయ్య, తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. ధర్నాల అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

తీసుకోని రుణం చెల్లించాలని బ్యాంకర్ల వేధింపులు

- డ్వాక్రా సభ్యురాలు భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - రేపల్లె (బాపట్ల జిల్లా)

రుణం తీసుకోకపోయినా..చెల్లించాలంటూ బ్యాంకర్లు వేధించడంతో ఓ డ్వాక్రా సభ్యురాలు భర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రేపల్లెలో జరిగింది. గతంలో మెప్మా పరిధిలోని ఆర్‌పిలు, ఇతర సిబ్బంది బ్యాంకర్ల సహకారంతో సుమారు 50 మంది డ్వాక్రా మహిళలను మోసం చేసి.. సుమారు మూడు బ్యాంకుల్లో ఒక్కో మహిళ పేరు మీద రూ.ఆరు లక్షల నుంచి ఎనిమిది లక్షల వరకు లోన్లను తీసుకున్నారు. తీసుకున్న రుణం చెల్లించాలని డ్వాక్రా గ్రూపు సభ్యురాలు గౌసియేను బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ వాళ్లు వేధించసాగారు. తాము బ్యాంకులో అప్పు తీసుకోలేదని గౌసియా మొరపెట్టుకున్నా.... బ్యాంకు అధికారులు వినిపించుకోలేదు. బ్యాంకు అధికారుల వేధింపులు తాళలేక గౌసియా భర్త కరిముల్లా ఆత్మహత్యాయత్నం చేశారు. డ్వాక్రా సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ఆందోళన చేపట్టారు. డ్వాక్రా బాధితులకు న్యాయం చేయాలని, లేకుంటే మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత డ్వాక్రా మహిళలు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని గెస్ట్ లెక్చరర్ల ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


వేతనాలు పెంచాలని ప్రభుత్వ జూనియర్ గెస్ట్ లెక్చరర్లు సోమవారం ఆందోళన చేపట్టారు. ఎపి గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయం వద్ద ఈ ఆందోళన నిర్వహించారు. తొమ్మిదేళ్ల నుంచి రూ.10 వేల జీతంతో రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్నామని తెలిపారు. జీతభత్యాలు పెంచాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా తమ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్..

యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ (అసిస్టెంట్ ప్రొఫెసర్లు) ఆందోళన నిర్వహించారు. ఏళ్ల తరబడి యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్టు) ఆధ్వర్యంలో సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయం వద్ద, అదేవిధంగా మంగళగిరిలో ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అతి తక్కువ వేతనంతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డిని, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె హేమచంద్రారెడ్డిని విడివిడిగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె అర్జునుడు, ప్రధాన కార్యదర్శి వి మల్లిఖార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులను కాపాడతాం

- యువగళం పాదయాత్రలో లోకేష్
- టిడిపిలో చేరిన యార్లగడ్డ వెంకట్రావు



వైసిపి నాయకులు యార్లగడ్డ వెంకట్రావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేష్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, గన్నవరం

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదరణ పథకం తీసుకొస్తామని, కులవృత్తులను కాపాడటమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి అధునాతన పనిముట్లను వృత్తిదారులకు రాయితీపై అందజేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. బిసిల్లో పేదరిక నిర్మూలనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 190వ రోజైన సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో సాగింది. తొలుత విజయవాడ రూరల్ మండలం నిడమానూరు శివారు క్యాంప్ సైట్లో బిసి కులవృత్తిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వృత్తిదారులు ప్రదర్శించిన పరికరాల ప్రత్యేక స్టాళ్లను లోకేష్ సందర్శించారు. అనంతరం వృత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వారితో మాట్లాడారు. దేవాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులను రెగ్యులరైజ్ చేసే అంశాన్ని తమ పార్టీలో చర్చించి త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దేవాలయాల్లో తలనీలాలపై వచ్చే ఆదాయంలో పది శాతంతో నిధి ఏర్పాటు చేస్తామన్నారు. బిసిలకు శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అందిస్తామని, చంద్రన్న బీమా పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తామని, నీరా కేఫ్‌లు ప్రారంభిస్తామని, లిక్కర్ షాపుల్లో గీత కార్మికులకు వాటా కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమ హయాంలో అభివృద్ధి చేసిన దోబీ ఘాట్లను వైసిపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో 26 వేల మంది బిసిలపై అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. అనంతరం పాదయాత్ర గూడవల్లి, కేసరపల్లి, గన్నవరం మీదుగా చిన్న అవుటపల్లి చేరింది. పాదయాత్రలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మాజీ ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, నాగుల్ మీరా, టిడిపి నాయకులు కేశినేని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో పసుపు జెండా ఎగురవేయాలి

యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ సమక్షంలో వైసిపి నాయకులు యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలో చేరారు. ఆయనకు లోకేష్ పసుపు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. యార్లగడ్డ గన్నవరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను యార్లగడ్డ వివరించారు అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లడం ద్వారా నియోజకవర్గంలో పసుపు జెండాను మరోసారి ఎగురవేయాలని లోకేష్ సూచించారు.

శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు

- 18 నుంచి సాలకట్ల, అక్టోబరు 15న నవరాత్రి

ప్రజాశక్తి - తిరుమల

ఈ ఏడాది శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడో ఏటా వచ్చే అధికమాసం కారణంగా కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. సెప్టెంబరు 18 నుంచి 26వ వరకు శ్రీవారి సాలకట్ల, అక్టోబరు 15 నుండి 23వ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహించనుంది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా సెప్టెంబరు 18న ధ్వజారోహణం, సెప్టెంబరు 22న గరుడ వాహనం, సెప్టెంబరు 23న స్వర్ణరథం, సెప్టెంబరు 25న రథోత్సవం(మహారథం), సెప్టెంబరు 26న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగనున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అక్టోబరు 19న గరుడవాహనం, అక్టోబరు 22న స్వర్ణరథం, అక్టోబరు 23న చక్రస్నానం నిర్వహించనుంది.

ఆర్జిత సేవలు రద్దు :

బ్రహ్మోత్సవాల కారణంగా సెప్టెంబరు 18 నుండి 26 వరకు, అక్టోబరు 15 నుంచి 23వ వరకు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. ముందస్తుగా ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న యాత్రికులను నిర్దేశిత వాహనసేవకు మాత్రమే అనుమతిస్తారు. అక్టోబరు 14న సహస్రదీపాలంకార సేవను రద్దు చేసింది.



బాధితులను పరామర్శిస్తున్న ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ బంగారమ్మ

అన్ని విధాలా ఆదుకుంటాం

- పాడేరు ప్రమాద బాధితులకు ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ బంగారమ్మ పరామర్శ

ప్రజాశక్తి - పాడేరు టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పాడేరు ఘాట్ రోడ్డులో లోయలోకి బస్సు దూసుకెళ్లిన ఘటనలో గాయపడి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆర్‌టిసి విజయనగరం జోనల్ ఛైర్మన్ బంగారమ్మ సోమవారం పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది ? ఆరోగ్యం ఎలా ఉంది ? అన్న వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘాట్‌లోని ప్రమాద స్థలానికి వెళ్లారు. మలుపు వద్ద ఓ చెట్టు కొమ్మ రోడ్డుపైకి వచ్చిందని, దాన్ని తప్పించుకుని ముందుకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా బైకు వచ్చిందని, దాన్ని కూడా తప్పించే క్రమంలో బస్సు లోయలోకి పడిందని ఆర్‌టిసి అధికారులు ఛైర్మన్‌కు తెలిపారు. లోయ ఏటవాలుగా ఉండడం, అందులో చెట్లు దట్టంగా ఉండడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని వివరించారు. జోనల్ ఛైర్మన్ మాట్లాడుతూ.. ప్రమాదంలో చనిపోయిన వారిని, గాయపడ్డవారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర పరామర్శించారు.

ముందస్తు బెయిల్ కేసు నేటికి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి : పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. చంద్రబాబు పుంగనూరు పర్యటన సందర్భంగా జరిగిన ఘటన నేపథ్యంలో పుంగనూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని రామచంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం వాదనలు జరిగాయి. 41ఎ నోటీసు ఇవ్వకుండా ఐపిసిలోని 307 సెక్షన్ కింద కూడా పిటిషనర్‌పై కేసు బనాయించారని న్యాయవాది ప్లహ్లాద్‌రెడ్డి చెప్పారు. ఘటన జరిగినప్పుడు పిటిషనర్ అక్కడే ఉన్నట్లుగా సాక్ష్యాధారాలు ఉన్నాయని పోలీసుల తరపున అదనపు ఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. విచారణ మంగళవారం కొనసాగిస్తామని జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

యువతలోని ప్రతిభను ప్రోత్సహించాలి

- వెంకయ్యనాయుడు



జెఇఇ ఆలిండియా ర్యాంకర్లను సన్మానించిన వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

యువతలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం ద్వారా భావితరాల్లో స్ఫూర్తినింపినట్లు అవుతుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 5, 10 ఆలిండియా ర్యాంకులు సాధించిన భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ విద్యార్థులు ఎం వెంకటశివరాం, వైవి మనీందర్‌రెడ్డిలకు గుంటూరు జిల్లా గోరంట్ల భాష్యం క్యాంపస్‌లో సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ భవిత యువత చేతుల్లోనే ఉందని, మంచి నడవడిక, క్రమశిక్షణతో చదివి, అనుకున్న లక్ష్యాలు సాధించి, ఉన్నతంగా ఎదగాలని అన్నారు. మాతృభాషను, మాతృభూమిని, విద్య నేర్పిన గురువును ఎప్పటికీ మరువకూడదని చెప్పారు. విద్యార్థులంతా ఉన్నతమైన భవిష్యత్తు కోసం క్రమశిక్షణ అలవర్చుకొని లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. భాష్యం స్థాపించిన 30 ఏళ్ల కాలంలో అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఖ్యాతి ఆర్జించిందంటే దాని వెనుక ఎంతో కఠోర శ్రమ, అంకిత భావం ఉందన్నారు. ఎంతోమంది భారతీయులు ఉన్నత సంస్థల్లో గొప్ప స్థాయిలో పదవులు అలంకరించి, దేశానికి కీర్తి ప్రతిష్టలను తీసుకొచ్చారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవడం భారతీయ సంస్కృతి అని దానికి అవలంభించాలన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని, కానీ దానికి బానిస కాకుండా, సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం ర్యాంకర్లను దుశ్శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం ఛైర్మన్ బి రామకృష్ణ, డైరెక్టర్ బి హనుమంతరావు, ముఖ్యసలహాదారు మైఖేల్‌రాజు, వీరేంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.



అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామ్ పునియాని

సాహిత్య రంగానికి పదునుపెట్టాలి

- ప్రొఫెసర్ రామ్ పునియాని

జబల్‌పూర్ : కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగ లక్ష్యాలైన దేశసమైఖ్యత, సమగ్రత, లౌకికతత్వంపై దాడులు పెరిగిపోయాయని, దేశచరిత్ర, సంస్కృతి, భాషను కాపాడుకునేందుకు సాహిత్య రంగానికి పదును పెట్టాలని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త, ప్రొఫెసర్ రామ్ పునియాని పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరుగుతున్న అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 18వ జాతీయ మహాసభల్లో రెండవ రోజున పలు అంశాలపై సదస్సులు జరిగాయి. రాజ్యాంగ పరిరక్షణ పరివ్యాప్తిలో ఎదుర్కొంటున్న ప్రమాదాలు సవాళ్లు, దోపిడీ వ్యవస్థ ప్రక్షాళనలో సాంస్కృతిక ఉద్యమం, ఉత్తమ సమాజ నిర్మాణంలో సాహిత్య పాత్ర అనే అంశాలపై సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా రామ్ పునియాని మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం వచ్చాక విద్యా వ్యవస్థను మొత్తం కాషాయీకరణ చేస్తోందని విమర్శించారు. పాఠ్యాంశాల్లో గాంధీ, భగత్‌సింగ్‌లాంటి వారి చరిత్రలు, డార్విన్ సిద్ధాంతం వంటి అంశాలను తొలగిస్తున్నారని అన్నారు. ధభోల్కర్, కల్బుర్గి, గోవింద్ పన్సారే, గౌరీలంకేష్ లాంటి ప్రశ్నించేవారిని మతోన్మాదులు హత్యలు చేస్తున్నారని అన్నారు. ఇలాంటి తిరోగమన శక్తులను ఎదుర్కొనేందుకు మంచి ప్రజా సాహిత్యాన్ని ప్రజలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా మణిపూర్ ఘటనలపై ఎపి అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన మణిపూర్ మంటలు, అక్షరమా నీకు వందనం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, అరసం రాష్ట్ర కమిటీ సభ్యులు జి ఓబులేసు, ఎఎంఆర్ ఆనంద్, బి నాగార్జున సాగర్, ఎం అరుణ్‌కుమార్, బంగారు ఆచార్యులు, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి పోలీస్ స్టేషన్లో మున్సిపల్ కార్మికులు, యూనియన్ నాయకులు

24న 'చలో విజయవాడ' జయప్రదానికి మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీలు

- పుట్టపర్తిలో పలువురు అరెస్టు, విడుదల

ప్రజాశక్తి- యంత్రాంగం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మున్సిపల్ కార్మికులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా పాదయాత్రలోనూ, ముఖ్యమంత్రిగా అసెంబ్లీ సాక్షిగానూ ఇచ్చిన హామీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో వారియర్స్‌గా పని చేసిన మున్సిపల్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో బైక్ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. పలువురు కార్మికులను, యూనియన్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతపురం, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, పల్నాడు, గుంటూరు, ఏలూరు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కార్మికులు బైక్ ర్యాలీలు నిర్వహించారు.



కాకినాడలలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రత్యేక హోదాపై ప్రధాన పార్టీలు నోరు విప్పాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో సిపిఐ బస్సు యాత్ర

ప్రజాశక్తి- కాకినాడ

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి, జనసేనలు ప్రత్యేక హోదాపై నోరు విప్పాలని, ఆ పార్టీలు క్షేత్రస్థాయిలో పోరాడితే ప్రత్యేక హోదా సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. 'రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి' పేరుతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర సోమవారం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో సాగింది. రాజమహేంద్రవరంలో యాత్రకు ఘనస్వాగతం లభించింది. గోదావరి గర్జన పేరిట బహిరంగ సభ జరిగింది. తొలుత యాత్రలో భాగంగా కాకినాడలోని గాంధీ భవన్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలు ప్రత్యేక హోదా, విభజన హామీలపై నోరు విప్పట్లేదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మెడలు వంచేందుకు సరైన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ముగిసిన అంశం కాదన్నారు. ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాడుతామన్నారు.

రాష్ట్రంలోని నీచ రాజకీయాలతో ప్రత్యేక హోదా అంశం పక్కదోవ పడుతోందన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సక్రమంగా జరగలేదన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి చట్టం చేశారన్నారు. విభజన హామీల అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. సిపిఎం నాయకులు శేషబాబ్జి మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వబోమని కరాకండిగా చెప్పిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన ఎలా కలిసి ప్రయాణిస్తున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు గాంధీ రాజు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మాట్లాడారు.

విలీన సమస్యలు పరిష్కరించండి : ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ఆర్‌టిసి ఉద్యోగులకు సంబంధించి విలీన సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ కోరింది. ఎపిఎన్‌జిఓ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరైన సందర్భంగా ఆయనకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఆర్‌టిసి కార్మికులు 2020 జనవరి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా విలీన ప్రక్రియ జరిగినా సగటు ప్రభుత్వ ఉద్యోగికి వుండే సర్వీస్ రూల్స్ ఇప్పటి వరకూ అమలు కాలేదని వివరించారు. పెన్షన్ సమస్య ఆర్‌టిసి ఉద్యోగులను వేధిస్తోందన్నారు. నాలుగేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు. కొత్త హెచ్ఆర్ పాలసీతో ఉద్యోగులు నష్టపోకుండా చూడాలన్నారు. ఆర్‌టిసిలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వున్న అన్ని రకాల అలవెన్స్‌లను మళ్లీ పునరుద్ధరించాలని కోరారు.

గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-నిజాంపట్నం (బాపట్ల జిల్లా)
నిజాంపట్నం హార్బర్ సమీపంలో మొగ వద్ద ఆదివారం జరిగిన ఫైబర్ బోటు బోల్తా ప్రమాదంలో గల్లంతైన తల్లి, ఇద్దరు బిడ్డలు మృతిచెందారు. మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులతో పాటు గజ ఈతగాళ్ల గాలింపు చర్యలను ముమ్మరం చేసి.. సాయి వర్షిక (25), తన్విష్ కుమార్ (7), తరుణ్ ఈశ్వర్ (11 నెలలు) మృతదేహాలను సోమవారం వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు నిజాంపట్నం ఎస్ఐ రమేష్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎంపి మోపిదేవి వెంకటరమణారావు పరామర్శించి, రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మరో అధికారిపై వేటు

- అనంతపురం పూర్వ జడ్‌పి సిఇఒ శోభా స్వరూపరాణి సస్పెన్షన్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి
నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను తొలగించారన్న ఆరోపణలపై అనంతపురం జిల్లాకు చెందిన మరో అధికారిపై వేటు పడింది. జిల్లా పరిషత్ పూర్వపు సిఇఒ శోభా స్వరూపరాణిని సస్పెండ్ చేస్తూ ఈనెల 19న పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా 1796 ఓటర్లను తొలగించారన్న ఆరోపణలున్నాయి. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం విచారణ చేపట్టి కొంత మందిపై చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అనంతపురం జడ్‌పి సిఇఒ కె.భాస్కర్‌రెడ్డి, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇద్దరు బిఎల్ఒలు సస్పెండ్ అయ్యారు.

తెలంగాణ ప్రగతిపై విషం చిమ్ముతున్న పత్రికల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వం : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం చివరి దశలో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రగతిపై విషం చిమ్మే పత్రికల్లో పనిచేసే విలేకరులకు ఇళ్ల స్థలాలివ్వబోమని, న్యూట్రల్‌గా ఉన్న జర్నలిస్టులందరికీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసిఆర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రగతిపై ఆర్‌బిఐ, నీతిఆయోగ్, కేంద్ర మంత్రులు ప్రశంసలు కురిపిస్తున్నా కొన్ని పత్రికలు పనికట్టుకుని వ్యతిరేక వార్తలు రాస్తున్నాయని, ఆ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఎందుకివ్వాలని, పాలుపోసి పామును పెంచలేము కదా అని కెసిఆర్ ప్రశ్నించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)
అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం రామచంద్రకోటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రైతు మాలపాటి భాస్కరరెడ్డి (46)కి 5.60 ఎకరాల సాగు భూమి ఉంది. అందులో వ్యవసాయ బోర్లు ఏర్పాటు చేసుకుని, మిరప, పత్తి సాగు చేసేవారు. ఆశించిన మేర దిగుబడులు రాలేదు. రూ.15 లక్షల వరకు అప్పు చేరుకుంది. ఈ ఏడాదైనా కలిసి వస్తుందనే ఆశతో మిరప నాటేందుకు పొలాన్ని సిద్ధం చేశారు. అప్పు తీర్చలేకపోవడంతో తిరిగి పెట్టుబడులకు ఎవ్వరూ రుణం ఇవ్వలేదు. దీంతో భాస్కరరెడ్డి సోమవారం ఉదయం తన పొలంలో పురుగు మందు తాగారు. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు.

దొంగ ఓట్ల నమోదు వికృత చేష్ట : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ప్రజాస్వామ్యంలో అధికార పార్టీ దొంగ ఓట్లను నమోదు చేయించడం అదో రకమైన వికృత చేష్ట అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఓటరు అవగాహనపై పార్టీ శ్రేణులకు రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు, అవినీతి, అరాచకాల్లో పోటీపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ దేవదర్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

- ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి
విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర'ను రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని, మిడ్డేమీల్స్ నిర్వహించాలని, హాస్టల్స్‌కు సొంత భవనాలు కేటాయించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కందుకూరి విద్యాసంస్థలకు నాడు-నేడు నిధులు కేటాయించాలని నినదించారు. కోటిపల్లి బస్టాండ్ నుంచి ట్రైనింగ్ కళాశాల, ఎస్‌కెవిటి పాఠశాలల్లో ఈ సందర్భంగా సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు పోరాడాలని కోరారు. వ్యక్తిగత వాదాన్ని పక్కన పెట్టి సమాజ బాధ్యత, శ్రేయస్సు కోసం పాటు పడాలన్నారు. ట్రైనింగ్ కళాశాలకు ఎంతో చారిత్రక వైభవం ఉందని, ప్రభుత్వ విధానాలు, సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 150కి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూరి సంస్థలకు సంబంధించిన కమర్షియల్ భవనాలను కందుకూరి విద్యాసంస్థలకు అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పేదలకు విద్యను దూరం చేసే విధానాలను విడనాడాలని, లేకుంటే విద్యార్థులతో కలిసి ఐక్యంగా పోరాడుతామని హెచ్చరించారు. అంతకుముందు కోటిపల్లి బస్టాండ్ నుంచి ట్రైనింగ్ కాలేజీ వరకూ వెంకటేశ్వరరావు సైకిల్ తొక్కారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, ఎన్.రాజా, జిల్లా మాజీ కార్యదర్శి బి.పవన్, జిల్లా సహాయక కార్యదర్శి వై.భాస్కర్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రలో సైకిల్ తొక్కుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

జాబిల్లికి ఆవలవైపు...

- చిత్రాలు విడుదల చేసిన ఇస్రో
- చంద్రయాన్-2 ఆర్బిటర్‌తో చంద్రయాన్-3 ల్యాండర్‌కు కమ్యూనికేషన్

బెంగళూరు : చంద్రుని ఉపరితలానికి ఆవలవైపు తీసిన చిత్రాలను ఇస్రో సోమవారం విడుదల చేసింది. చంద్రుడికి ఆవల వైపు భాగం ఎప్పుడూ భూమికి కనిపించదు, అందువల్ల దీన్ని చీకటి ప్రాంతంగా పేర్కొంటారు. ఇప్పుడు ఈ చీకటి ప్రాంతం వివరాలు తెలుసుకునేందుకే ఈ చంద్రయాన్-3ని పంపించారు. ల్యాండర్‌లోని ఎల్‌హెచ్‌డిఎసి (ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా) ఈ నెల 19న ఈ చిత్రాలను తీసింది. "పెద్ద పెద్ద బండరాళ్లు లేదా లోతైన గోతులు లేకుండా చంద్రయాన్ సురక్షితంగా ల్యాండ్ అయ్యే ప్రాంతాన్ని గుర్తించడంలో ఈ కెమెరా సాయపడుతుంది." అని ఇస్రో సామాజిక వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆదివారం చంద్రుని ఉపరితలంపై కుప్పకూలిన రష్యా లూనార్ మిషన్ లూనా-25 కూడా చంద్రుని ఆవల వైపు భాగానికి సంబంధించిన చిత్రాలను పంపింది. ఈ నెల 5, 15, 17 తేదీల్లో చంద్రయాన్-3 పంపిన మూడు వీడియోలను ఇస్రో ఇప్పటికే విడుదల చేసింది.

స్వాగతం మిత్రమా !

చంద్రయాన్-2 ఆర్బిటర్, చంద్రయాన్-3 లూనార్ మాడ్యూల్ మధ్య పరస్పర కమ్యూనికేషన్ ఏర్పడిందని ఇస్రో సోమవారం ప్రకటించింది. "వెల్‌కమ్ బడ్డీ !" (స్వాగతం మిత్రమా !) అంటూ చంద్రయాన్-2 ఆర్బిటర్, చంద్రయాన్-3 ల్యాండర్ మాడ్యూల్‌ను పలకరించి, స్వాగతం చెప్పింది. ల్యాండర్ మాడ్యూల్‌ను చేరడానికి ఇప్పుడు మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఒఎక్స్)కు అనేక మార్గాలు వున్నాయని ఇస్రో పేర్కొంది.

బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ దిగుతుందని భావిస్తున్నట్లు ఇస్రో ప్రకటించిన సంగతి తెలిసిందే. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్‌లో మాక్స్ విభాగం వుంది. 5.20 గంటల నుంచి ల్యాండింగ్ ప్రక్రియ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమవుతుందని ఇస్రో తెలిపింది.

బిజెపి ఎంపి, హీరో సన్నీ డియోల్ అప్పు ఎగనామం

- బ్యాంక్ ఆఫ్ బరోడా నోటీసులు అనూహ్యంగా ఉపసంహరణ

న్యూఢిల్లీ : బిజెపి ఎంపి, ప్రముఖ బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ బ్యాంక్‌ల నుంచి అప్పులు తీసుకుని ఎగనామం పెట్టారు. మధ్యప్రదేశ్ నుంచి ఎంపిగా ఎన్నికయిన సన్నీడియోల్ 2016లో ఒక సినిమా కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) నుంచి అప్పు తీసుకున్నారు. బకాయి రూ.56 కోట్లకు చేరడంతో, గతేడాది మొండి బకాయిల జాబితాలో చేర్చారు. ముంబయిలో సన్నీకి చెందిన ఓ విల్లాను సెప్టెంబర్ 25న ఇ-వేలం వేస్తామని, ఇందులో పాల్గొనే వారు సెప్టెంబర్ 22లోపు దరఖాస్తు చేసుకోవచ్చని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. సన్నీ డియోల్‌కు అప్పు తీసుకునేటప్పుడు సన్నీ సౌండ్స్ డియోల్స్ యాజమాన్యంలోని సంస్థ సహా, సన్నీ డియోల్ తండ్రి, బాలీవుడ్ హీరో నటుడు, బిజెపి మాజీ ఎంపి. తండ్రి ధర్మేంద్ర వ్యక్తిగత హామీ ఇచ్చారు. ధర్మేంద్ర భార్య, నటి హేమామాలిని కూడా బిజెపి ఎంపి కావడం విశేషం. బిఒబి అనూహ్యంగా సన్నీ డియోల్‌కు ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. సాంకేతిక కారణాల వల్ల ఇ-వేలంను రద్దు చేశామని బిఒబి వెల్లడించింది. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓట్లు తొలగింపుతో ప్రజాతీర్పు అపహాస్యం : బోండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఇష్టానుసారం ఓట్లు తొలగించడమంటే ప్రజల తీర్పును అపహాస్యం చేయడమేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలవాలని వైసిపి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్ల ద్వారా సేకరించిన సమాచారంతో పెద్దయెత్తున నకిలీ ఓటర్లను సృష్టిస్తోందని ఆరోపించారు. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ అండతో అధికారులు ఆరువేల ఓట్లు తొలగించారని అన్నారు. ఈ తప్పిదాలకు బాధ్యుల్ని చేస్తూ ఒక తహశీల్దారును, ఐదుగురు బిఎల్ఒలను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని తెలిపారు. అనంతపురం జెడ్‌పి సిఇఒనూ సస్పెండ్ చేసిందని వివరించారు. టిడిపి కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా 400 మందితో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించిందని విమర్శించారు. ఈ త్వరలోనే ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లనున్నారని తెలిపారు.

'దళితులు రాకుండా ఆలయానికి తాళం వేసిన... శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి - పుత్తూరు , యంత్రాంగం (తిరుపతి జిల్లా)
దళితులు రావడానికి వీల్లేదంటూ ఆలయానికి తాళం వేసిన శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఎం దృష్టికి ఈ వివక్షను తీసుకెళ్లి, చలో పోలాక్షమ్మ ఆలయం చేపడతామన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మంగళవారం ఎస్‌పి, కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని, గురువారం నిరసన దీక్ష చేపట్టాలని, 28న ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తాయని కార్యాచరణ రూపొందించారు. స్పందించకుంటే సెప్టెంబర్ 3వ తేదీ 'చలో రామకృష్ణాపురం పోలాక్షమ్మ గుడి' చేపడతావని నేతలు హెచ్చరించారు.


చీరాల డిపోలో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు , బస్సు డ్రైవర్లు

డ్రైవర్‌పై ప్యాసింజర్ దాడి

- 40 బస్సులు నిలిపివేసి నిరసన

ప్రపజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)
తాను ఆపమన్నప్పుడు వెంటనే బస్సు ఆపలేదని.. హైర్ బస్సు డ్రైవర్‌పై ఓ ప్యాసింజర్ ఆదివారం దాడి చేశాడు. దీంతో డ్రైవర్‌కు మద్దతుగా హైర్ బస్సు డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో 40 సర్వీసులను నిలిపేసి.. సోమవారం నిరసన తెలిపారు. బాధితుడి కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం విజయవాడ నుండి చీరాల డిపో హైర్ బస్సును ప్యాసింజర్లతో డ్రైవర్ శివయ్య బయలుదేరాడు. చీరాల వెళ్లేందుకు విజయవాడ గౌతమి విద్యాసంస్థలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఈపురుపాలెంకు చెందిన ఊట్ల శ్రీనివాసరావు విజయవాడలో బస్సును ఆపాడు. ఇతర వాహనాలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కొంతదూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ బస్సును ఆపాడు. తాను ఆపమన్న చోట ఆపలేదని కోపోద్రిక్తుడైన శ్రీనివాసరావు బస్సు డ్రైవర్‌తో వాదనకు దిగాడు. 'నేనెవరో తెలుసా? నా భార్య గుంటూరు జిల్లాలో ఆర్‌టిసి డిపిటిఒ అధికారి.. నా గురించి నీకు పూర్తిగా తెలియదు' అంటూ తోటి ప్రయాణికుల ముందే కండక్టర్‌తో పాటు డ్రైవర్ శివయ్యను దుర్భాషలాడాడు. శివయ్యపై దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన శివయ్యను చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. అనంతరం అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ సిబ్బందిపై ప్రయాణికులు దాడి చేయడాన్ని ఖండిస్తూ విజయవాడ, ఒంగోలు, నరసరావుపేట పరిధిలో సుమారు 40 హైర్ బస్సు సర్వీసులను సోమవారం నిలిపివేశారు. బాపట్ల ఆర్ఎం, చీరాల డిఎం శ్యామలతో సిఐటియు నాయకులు బాబూరావు, ఎం.వసంతరావు చర్చలు జరిపారు. శ్రీనివాసరావుపై కేసు నమోదుకు సహకరిస్తామని ఆర్‌టిసి అధికారులు హామీ ఇచ్చారు. చికిత్స పొందుతున్న డ్రైవర్ శివయ్యను సిఐటియు నాయకులు, హయ్యర్ బస్సు సిబ్బంది పరామర్శించారు.

బ్యాంకింగ్ మోసాల్లో 'ఉన్నతాధికారుల'పై చర్యలు

ప్రత్యేక అడ్వైజరీ బోర్డు ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రభుత్వ బ్యాంకింగ్, విత్త రంగంలో ఆర్థిక మోసాల్లో ఉన్నతాధికారుల పాత్రపై విచారణ చేయడానికి కేంద్రం కొత్త బోర్డ్‌ను ఏర్పాటు చేసింది. మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్ (సివిసి) సురేష్ ఎన్ పటేల్ ఛైర్మన్‌గా బ్యాంక్ మోసాలపై అడ్వైజరీ బోర్డ్‌ను నియమించింది. ది అడ్వైజరీ బోర్డ్ ఫర్ బ్యాంకింగ్, ఫైనాన్సియల్ ఫ్రాడ్స్ (ఎబిబిఎఫ్ఎఫ్)లో సభ్యులుగా మాజీ సైనికుల సంక్షేమ శాఖ మాజీ కార్యదర్శి రవి కాంత్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ మాజీ డైరెక్టర్ జనరల్ రజనీ కాంత్ మిశ్రా, ఎగ్జిమ్ బ్యాంక్ మాజీ ఎండి డేవిడ్ రాస్కిన్హా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ మాజీ ఎండి, సిఇఒ పార్థ ప్రతీమ్ సేన్‌గుప్తా ఉన్నారు. ఛైర్మన్, సభ్యుల పదవీ కాలం 2023 ఆగస్టు 21 నుండి రెండేళ్ల పాటు ఉంటుందని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఎబిబిఎఫ్ఎఫ్ ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు, ప్రభుత్వ రంగంలోని అన్ని స్థాయిల అధికారుల పాత్రను పరిశీలిస్తుంది. రూ.3 కోట్లకు పైబడిన మోసాలకు సంబంధించిన అన్ని విషయాలను బోర్డుకు సూచిస్తాయి.

ప్లేస్టోర్ నుంచి 43 యాప్స్ తొలగింపు

న్యూఢిల్లీ : 43 యాప్స్‌ను తొలగిస్తున్నట్లు గూగుల్ ప్లే స్టోర్ వెల్లడించింది. సదరు యాప్స్ ఫోన్ బ్యాటరీ లైఫ్‌ను తినేయడంతోపాటు యూజర్ల డేటాను తస్కరిస్తున్నాయని, గూగుల్ ప్లే స్టోర్ పాలసీలను ఉల్లంఘిస్తున్నాయని మొబైల్ రీసెర్చ్ టీం మైకేఫే పేర్కొంది. టివి, డిఎంబి ప్లేయర్స్, మ్యూజిక్ డెవలపర్స్, బారో టీవీ, జిహోసాఫ్ట్ మొబైల్ రికవరీ యాప్, మ్యూజిక్ బడా, మ్యూజిక్ డౌన్‌లోడర్, బారో డిజిటల్ గిఫ్టింగ్ యాప్, న్యూ లైవ్, రింగ్‌టోన్స్ ఫ్రీ మ్యూజిక్, స్ట్రీమ్‌కార్ లైవ్ స్ట్రీమింగ్, లైవ్‌ప్లే తదితర యాప్స్ తొలగించిన వాటిలో ఉన్నాయి.



భారీ విస్తరణపై బిగ్ సి దృష్టి

- వచ్చే రెండేళ్లలో రూ.300 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి భారీ విస్తరణపై దృష్టి పెట్టంది. వచ్చే రెండేళ్లలో కొత్తగా 150 స్టోర్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ సంస్థకు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడులో 250 స్టోర్లున్నాయి. ఆర్థిక సంవత్సరం 2023-24లో 50 శాతం వద్ధితో రూ.1,500 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని బిగ్ సి ఫౌండర్, సిఎండి బాలు చౌదరి తెలిపారు. కంపెనీ రెండు దశాబ్దాల వేడుకల్లో భాగంగా బిగ్-సి బ్రాండ్ అంబాసిడర్, సినీ నటుడు మహేశ్ బాబుతో కలిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై స్వప్న కుమార్, డైరెక్టర్లు జి.బాలాజీ రెడ్డి, ఆర్.గౌతమ్ రెడ్డి, కైలాశ్ లఖ్యానితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2002 డిసెంబర్ 23న బిగ్‌సి ప్రయాణం ప్రారంభమయ్యిందన్నారు. ఇప్పటి వరకు తొలి స్థానంలో నిలిచామని.. మూడవ దశాబ్దంలోనూ అగ్ర స్థానాన్ని కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 3 కోట్ల మంది వినియోగదారులను చేరకున్నా మన్నారు.

బోణీకొట్టిన బెజవాడ టైగర్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)
వరుసగా మూడు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన బెజవాడ టైగర్స్ జట్టు ఎట్టకేలకు బోణీకొట్టింది. విశాఖలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ 2లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలుచుకున్న ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని బరిలోకి దిగినా, ఓపెనర్లు అంతగా రాణించలేదు. మిడిల్ ఆర్డర్ ఆటగాళ్లు జి శ్యామ్ సుందర్, ఎస్‌వి రాహుల్ చక్కని ఆటతీరుతో 77 బంతుల్లో 86 పరుగులతో మంచి పార్టనర్‌షిప్ నెలకొల్పారు. మొత్తానికి 20 ఓవర్లలో 4 వికెట్లను కోల్పోయి 159 పరుగులు సాధించింది. బెజవాడ టైగర్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు స్పీడ్‌కు బ్రేకులు పడ్డాయి. బ్యాటింగ్‌కు దిగిన బెజవాడ టైగర్స్ 160 పరుగుల టార్గెట్‌ను 18.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టంతో గెలుపు అందుకున్నారు. ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్ కె మహీప్ కుమార్ 51 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లుతో 77 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.



సంపాదకీయం

ప్రజలే ఎజెండా కావాలి

సెప్టెంబర్ మొదటి వారంలో రాజధాని ఢిల్లీలో జరిగే జి-20 దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో ప్రపంచ వ్యాప్త ప్రజల ఈతిబాధలపై చర్చించాలన్న పౌర సంస్థల 'వియ్ 20' పీపుల్స్ సమ్మిట్ డిమాండ్ సహేతుకమైనది. కేవలం మార్కెట్ శక్తుల ప్రయోజనాల కోసమే జి-20 భేటీ అయితే నిష్ప్రయోజనమన్న 'వియ్ 20' అభిప్రాయం సమర్ధనీయమైనది. మోడీ నేతృత్వంలోని రాజ్యం కల్పించిన పలు అవాంతరాలు, నిరంకుశ చర్యల మధ్య 'జి 20' నెత్తికెత్తుకున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయాలపై చర్చించేందుకు దేశంలోని పలు పౌర, ప్రజాతంత్ర సంస్థలు, మేధావులు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో 'వియ్ 20' పేరిట సమావేశమయ్యారు. చివరి రోజు ఆదివారం డిక్లరేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఎక్కడోక్కడ జి 20 దేశాల అధినేతలు కూర్చొని చర్చిస్తున్నదంతా ధనిక దేశాల మార్కెట్, ఆర్థిక వ్యవస్థల రాజకీయ ప్రయోజనాల ప్రాతిపదికనే. ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, ఎడిబి, డబ్ల్యుటిఓ ప్రతిపాదిస్తున్న ఆర్థిక విధానాలను ముందుకు తీసుకుపోవడమే లక్ష్యంగా చర్చలు, నిర్ణయాలు జరుగుతున్నాయి. ప్రజలను విస్మరిస్తున్నాయి. జి 20 దేశాధినేతలు తమ గొంతు వినాలన్నదే ప్రజల కోరిక. వారి ఆకాంక్షను 'వియ్ 20' సెమినార్ ప్రపంచం ముందుంచింది.

ప్రజల ఎజెండా లేకుండా జి 20 సదస్సులో చర్చించడమే పెద్ద దగా. పెట్టుబడిదారీ విధానమొక్కటే విశ్వమానవాళికి ఏకైక మార్గమన్న సూత్రాన్ని ఆ విధానంలో తరచు సంభవిస్తున్న సంక్షోభాలు పటాపంచలు చేస్తున్నాయి. 2008 నాటి ఆర్థిక మాంద్యం అప్పటికి తాత్కాలికంగా సమసిపోయిందనిపించినా ఆ ఛాయలు తొలగిపోలేదు సరికదా మరింత విస్తరిస్తున్నాయి. కోవిడ్ విలయంతో పరిస్థితులు తిరోగమనంలో పడ్డాయి. ప్రజల్లో ఆర్థిక, సామాజిక అసమానతలు మరింతగా పురివిప్పాయి. వ్యవసాయం, ఆహారం, జీవనోపాధి, వాతావరణ సమతుల్యత, పర్యావరణం, మానవ హక్కుల ఉల్లంఘనలు సంభవిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి హాని కలుగుతోంది. ఈ సమస్యలను, సంక్షోభాలను పరిష్కరించడంలో దేశాల ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ప్రజా ఉద్యమాలు, పౌర సమాజ సంస్థలు, మానవ హక్కుల కార్యకర్తలు, అన్ని రకాల ప్రగతిశీల శక్తుల మధ్య పూర్తి స్థాయి ఐక్యత, సంఘీభావం సాధించినప్పుడే ప్రభుత్వాలు దిగి వస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రజానీకానికి సమ్మిళిత, పారదర్శక న్యాయంతో కూడిన సమానత్వ సాధన లక్ష్యాన్ని వియ్ 20 తన డిక్లరేషన్‌లో ఆవిష్కరించింది.

జి 20 సదస్సుకు అధ్యక్షత వహించే భాగ్యం మన దేశానికి దక్కింది ప్రధాని మోడీని చూసేనని బిజెపి మంత్రులు, ఇతర నాయకులు ఊరూవాడా టముకు వేసుకుంటున్నారు. నిజానికి జి 20 లోని అన్ని దేశాలకు మల్లే భారత్‌కూ అధ్యక్షత అవకాశం వచ్చింది తప్పితే ప్రత్యేకతేమీ లేదు. ప్రస్తుతం దేశం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. అసమానతలు పెరుగుతున్నాయి. పేదరికం, నిరుద్యోగం, పారిశ్రామిక మందగమనం, అధిక ధరలూ రాజ్యమేలుతున్నాయి. దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, రైతులు, కార్మికులు, మహిళలపై దాడులు, మతఘర్షణలు, ప్రజాతంత్ర, పౌర హక్కుల హననానికి అడ్డు అదుపు లేదు. పార్టీలకతీతంగా, మేధావులు, పౌర సంస్థలు ఏర్పాటు చేసుకున్న ఇండోర్ మీటింగ్ 'వియ్ 20' సమ్మిట్. జరగనీకుండా పోలీసులతో అడ్డుకోవడాన్ని బట్టి మోడీ ప్రభుత్వంలో అసమ్మతిపై అసహనం స్థాయిని, నిరంకుశాన్ని, అణచివేత ధోరణిని, ప్రజాస్వామ్య హననాన్ని తెలుపుతుంది. జి 20 కోసం ఢిల్లీలో, చివరికి మన విశాఖపట్నంలో సైతం పేదలను ఏ విధంగా దూరంగా తరిమేశారో, ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేశారో చూశాం. జి 20 సదస్సు మణిపూర్‌లో జరిపితే మోడీ ప్రభుత్వ అసలు రంగు ప్రపంచానికి తెలిసొచ్చేది. జి 20 అడ్వర్టయిజ్‌మెంట్ల కోసం మోడీ సర్కారు వందల కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తోంది. మోడీ ప్రభుత్వమైనా, ఇతర జి 20 దేశాధినేతలైనా ప్రజలు ఏం కోరుకుంటున్నారో వారికేం కావాలో చర్చించి చర్యలు తీసుకున్నప్పుడే జనానికి ప్రయోజనం, లేదంటే ప్రజలకు ఒనగూరేదేమీ ఉండదు.

మహనీయుల మాట

షోయబుల్లాఖాన్ వర్థంతి నేడు



పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలమది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని పరిస్థితులు. అయినప్పటికీ తన 'ఇమ్రోజ్' పత్రిక ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన కలం యోధుడు. సత్య ప్రకటన తన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని ధీశాలి. నిజాన్ని నిర్భయంగా రాసి రజాకార్ల చేతిలో బలైన అమరుడు షోయబుల్లాఖాన్.


జననం :12.10.1920 - మరణం: 22.8.1948

తొలగని వలస దోపిడీ

గతంలో సామ్రాజ్యవాదుల పీడనలో ఉండిన దేశాలు ఆ వలస పాలన అంతమయ్యాక తమ తమ దేశాల్లో వలస దోపిడీకి ముగింపు పలికేందుకు వీలుగా ఆ యా దేశాల ఆర్థిక వ్యవస్థలను, సహజ వనరులను ప్రభుత్వ నియంత్రణలో నిర్వహించే విధానాలను అనుసరించాయి. ఆ క్రమంలో సామ్రాజ్యవాద దేశాలు తమ ఖనిజ సంపదను, ఇతర సహజ వనరులను కొల్లగొట్టే వీలు లేకుండా చేశాయి. స్వదేశాలలో పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి వీలుగా బహుళజాతి సంస్థల ప్రవేశాన్ని నియంత్రించే రక్షణ విధానాలను అనుసరించాయి. ఇప్పుడు నయా ఉదారవాద విధానాలను తీసుకువచ్చి మళ్ళీ తమ ఆర్థిక, పారిశ్రామిక ఆధిపత్యాన్ని ఆ పాత వలస దేశాల మీద నెలకొల్పడానికి సామ్రాజ్యవాద దేశాలు పూనుకుంటున్నాయి.

ఐతే వలస పాలన నుండి విముక్తి పొందినప్పటికీ, సామ్రాజ్యవాద దోపిడీ నుండి పూర్తిగా విముక్తి సాధించలేకపోయిన దేశాలు కొన్ని ఉన్నాయి. పశ్చిమ ఆఫ్రికా ఖండంలో ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ఆధిపత్యం కింద వలసలుగా ఉండిన దేశాలు ఈ కోవకి చెందుతాయి. ఆ దేశాలలో పాలకుల స్థానంలోకి స్థానికులతో ఏర్పడిన ప్రభుత్వాలు వచ్చినా, ఆ కొత్త పాలకులు తమ తమ ఆర్థిక వ్యవస్థలపై ఫ్రెంచి ఆధిపత్యాన్ని తొలగించలేకపోయాయి. దాని ఫలితంగా కనీసం తాత్కాలికంగానైనా ఫ్రెంచి సామ్రాజ్యవాద దోపిడీని నిలవరించలేకపోయాయి.

ఆ దేశాలలో ఫ్రెంచి సైన్యాలు తమ స్థావరాలను యథాతథంగా కొనసాగిస్తూ వచ్చాయి. ఆ దేశాలు ఫ్రెంచి కరెన్సీ వ్యవస్థ తోనే ముడిపడి వున్నాయి. ప్రత్యేకంగా వలస దేశాల మీద పెత్తనం కొనసాగించడానికి 1945లో సిఎఫ్ఎ ఫ్రాంక్ అనే కరెన్సీని ఫ్రాన్స్ ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఫ్రెంచి కరెన్సీ యూరోతో అనుసంధానం అయిన తర్వాత ఈ దేశాల ఆర్థిక నిర్వహణ కూడా యూరోతో ముడిపడిపోయింది. ఈ సిఎఫ్ఎ ఫ్రాంక్ మారకపు విలువను వాస్తవానికన్నా ఎక్కువగా నిర్ధారించారు. ఆ విధంగా నిర్ణయించడం ఫలితంగా ఆ పశ్చిమ ఆఫ్రికా ప్రాంత దేశాలలో ఉన్న పరిశ్రమలు కొనసాగలేక మూతబడి పోయాయి. ఫలితంగా నిరుద్యోగం ప్రబలింది (తూర్పు జర్మనీ పశ్చిమ జర్మనీతో విలీనం అయినప్పుడు కూడా ఇదే విధంగా జరిగింది. తూర్పు జర్మనీలో అనేక పరిశ్రమలు మూతబడ్డాయి.). ఇలా ఎందుకు జరిగింది? ఆ దేశంలో ఉత్పత్తి అయిన సరుకును కొనడానికి ఎక్కువ ధరను చెల్లించాల్సి వచ్చింది. అదే సరుకును ఫ్రాన్స్ నుండి దిగుమతి చేసుకుంటే చవకగా లభించింది. దాంతో స్థానిక పరిశ్రమలు నిలదొక్కుకోలేకపోయాయి. అదే సమయంలో ఆ దేశాలలో లభించే ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మేటప్పుడు ఆ మార్కెట్‌లో ఉండే పోటీకి అనుగుణంగా తమ సరుకుల ధరలను సవరించుకోవలసి వచ్చింది. అందువలన తమ దేశాల్లో కూలీలకు ఇచ్చే వేతనాలను కుదించవలసి వచ్చింది. ఆ విధంగా దేశీయ మార్కెట్‌లో విదేశీ సరుకుల పోటీని తట్టుకుని నిలదొక్కుకోలేని పరిస్థితి ఒక పక్క, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ ఫలితంగా తమ దేశాల శ్రామికుల వేతనాలను తగ్గించవలసిన పరిస్థితి ఇంకోపక్క ఏర్పడ్డాయి. అందువలన ఈ దేశాలు అభివృద్ధికి నోచుకోకుండా, నిరుపేదరికంలో కూరుకుపోయాయి.


ప్రభాత్ పట్నాయక్

> ఆ విధంగా దేశీయ మార్కెట్‌లో విదేశీ సరుకుల పోటీని తట్టుకుని నిలదొక్కుకోలేని పరిస్థితి ఒక పక్క, అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ ఫలితంగా తమ దేశాల శ్రామికుల వేతనాలను తగ్గించవలసిన పరిస్థితి ఇంకోపక్క ఏర్పడ్డాయి. అందువలన ఈ దేశాలు అభివృద్ధికి నోచుకోకుండా, నిరుపేదరికంలో కూరుకుపోయాయి.



అంతే కాదు. ఈ దేశాలు తమ విదేశీ మారకపు నిల్వలలో అత్యధిక భాగాన్ని (కనీసం 50 శాతాన్ని) ఫ్రాన్స్‌లో దాచుకున్నాయి. దాని ఫలితంగా ఫ్రాన్స్ దేశపు విదేశీ మారకపు నిల్వలు అపారంగా పెరిగాయి. ఆ నిల్వల విలువలు తగ్గిపోకుండా ఉండాలంటే ఈ దేశాల కరెన్సీలు ఫ్రెంచి కరెన్సీతో మారకం ఒక స్థిరమైన రేటులో కొనసాగించాలి. అలా కొనసాగాలంటే ఆ దేశాల ద్రవ్య విధానాలు ఫ్రెంచి దేశపు ద్రవ్య విధానంతో ముడిపడి వుండాలి. దాని ఫలితంగా తమ దేశాలలో ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసే విధానాలను అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో పశ్చిమ ఆఫ్రికా దేశాలు పడిపోయాయి.

పశ్చిమ ఆఫ్రికా దేశాలపై ఈ విధమైన ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ఫ్రాన్స్ ప్రభుత్వం నానా రకాల వికృత చర్యలకూ పూనుకుంది. తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాలు ఏర్పడడం కోసం కొన్ని దేశాలలో ప్రజాస్వామ్యం ముసుగులో ఎన్నికల రిగ్గింగ్‌కు పాల్పడింది. మరికొన్ని దేశాలలో కుట్రల ద్వారా ప్రభుత్వాలను కూలదోసింది. మరికొన్ని చోట్ల అధినేతలను హత్య చేయించింది. ఈ విధమైన చర్యలలో మనకి కొట్టవచ్చినట్టు కనిపించే ఉదంతం 1983లో బుర్కినా ఫాసో లో జరిగింది. థామస్ సంకారా అనే సైన్యాధికారి, మార్క్సిస్ట్ విప్లవకారుడు, ఆఫ్రికా దేశాలన్నింటి మధ్యా ఐక్యత నెలకొల్పాలని వాంఛించినవాడు బుర్కినా ఫాసోలో 1983లో అధికారానికి వచ్చాడు. వెంటనే తన దేశం నుండి ఫ్రెంచి సైన్యాలు ఖాళీ చేయాలని ఆదేశించాడు. కాని కొద్ది రోజుల్లోనే అతనిని హత్య చేశారు. థామస్ సంకారాకు సన్నిహితులుగా ఉండినవారితోనే అతడిని హత్య చేయించారు. ఆ హత్యకు సూత్రధారిగా ఉండినవాడు ఫ్రెంచి సామ్రాజ్యవాదుల ఏజంట్. అతగాడే ఆ తర్వాత దేశాధ్యక్షుడయ్యాడు. ఆ తర్వాత పశ్చిమ ఆఫ్రికా దేశాల మధ్య ఆర్థిక సహకారం కోసం ఎకనామిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్ (ఇకోవాస్) అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిజానికి సామ్రాజ్యవాదులకు అనుకూలంగా వ్యవహరించే నాయకులతో ఏర్పడింది. ఈ సంస్థ ద్వారా అన్ని పశ్చిమ ఆఫ్రికా దేశాలమీదా ఫ్రాన్స్ తన ఆధిపత్యాన్ని కొనసాగించగలుగుతోంది. ఈ ఆధిపత్యాన్ని ఎదిరించినందుకే థామస్ సంకారా హత్యగావించబడ్డాడు. కాని పశ్చిమ ఆఫ్రికా దేశాల ప్రజలకు అతడు ఆరాధ్యుడుగా నిలిచాడు.

ఐతే ఇటీవల ఆ పశ్చిమ ఆఫ్రికా దేశాలలో కొన్నింటిలో సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు తలెత్తుతున్నాయి. గినీ, మాలి, చాద్, బుర్కినా ఫాసో వంటి దేశాల్లో ఇప్పుడు సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే ప్రభుత్వాలు వచ్చాయి. తమ దేశాలనుండి ఫ్రెంచి సైన్యాలు ఖాళీ చేయాలని గత రెండు, మూడేళ్ళుగా పట్టుబడుతున్నాయి. మాలిలో ఆ సైన్యాలను వెళ్ళగొట్టడంలో జయప్రదం అయ్యాయి.

ఈ దేశాల లిస్టులో తాజాగా నైగర్ చేరింది. ఈ దేశాలలో ప్రభుత్వాలన్నీ కుట్రల ద్వారా అంతకు ముందున్న సామ్రాజ్యవాద అనుకూల ప్రభుత్వాలను కూలదోసి అధికారానికి వచ్చినవే. నైగర్ లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కుట్ర ద్వారా కూలదోసి సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభుత్వం వచ్చింది. దీంతో సామ్రాజ్యవాద దేశాలన్నీ తప్పుడు ప్రచారాన్ని మొదలుబెట్టాయి. తమ ఆధిపత్యాన్ని వ్యతిరేకించి వచ్చిన కొత్త ప్రభుత్వాలన్నీ ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వాలే అన్న ప్రచారం చేస్తున్నాయి. అదే గతంలో తమకు అనుకూలంగా ప్రభుత్వాలు ఏర్పరచడం కోసం సాగించిన కుట్రల విషయంలో ఏనాడూ నోరు విప్పలేదు.

నైగర్ ఉదంతం సామ్రాజ్యవాదుల రెండు నాల్కల ధోరణిని స్పష్టంగా చూపిస్తుంది. ఇక్కడ ఎన్నికైన దేశాధ్యక్షుడు బెజూమ్ సామ్రాజ్యవాదానికి పూర్తిగా అనుకూలుడు. ఎంత దాకా పోయాడంటే తన దేశంలో ఉన్న ఫ్రెంచి సైన్యాల సంఖ్యను ఇంకా పెంచాలని కోరాడు! దాంతో అతడికి సెక్యూరిటీగా ఉండిన వారినే ఉపయోగించి నైగర్ దేశం సైన్యంలోని ఉన్నతాధికారుల బృందం బెజూమ్‌ను పదవి నుండి తప్పించి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అమెరికా దేశపు దేశాంగ సహాయ మంత్రిగా (డెప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్) ఉన్న విక్టోరియా న్యూలాండ్ స్వయంగా నైగర్ పోయి అక్కడ కుట్రదారులలో ముఖ్యుల్ని కలుసుకుని మళ్ళీ బెజూమ్ ను దేశాధ్యక్షుడిగా తీసుకురావాలని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని(!) కోరారు. ఇదే విక్టోరియా న్యూలాండ్ 2014లో ఎన్నికైన విక్టర్ యానుకోవిచ్ ప్రభుత్వాన్ని అధికారాన్నుంచి తప్పించడానికి పన్నిన కుట్రకు సూత్రధారిగా వ్యవహరించారు. ఆ తర్వాత అక్కడ అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పడడం ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధానికి ఏ విధంగా దారితీసిందో మనం చూస్తున్నాం. సామ్రాజ్యవాదులకి ప్రజాస్వామ్యం మీద నిజమైన ప్రేమ లేదని, కేవలం తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం అవసరం వచ్చినప్పుడు మాత్రమే ఆ పదాన్ని ఉపయోగిస్తారని దీనిని బట్టి చెప్పవచ్చు.

> సామ్రాజ్యవాదులకి ప్రజాస్వామ్యం మీద నిజమైన ప్రేమ లేదని, కేవలం తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం అవసరం వచ్చినప్పుడు మాత్రమే ఆ పదాన్ని ఉపయోగిస్తారని దీనిని బట్టి చెప్పవచ్చు.

ఏదైనప్పటికీ కుట్రల ద్వారా ప్రభుత్వాలను ఏర్పరచడం అభ్యంతరకరమే కదా అని వాదించవచ్చు. కాని పశ్చిమ ఆఫ్రికా లోని చాలా మంది ప్రభుత్వ నేతలు ఫ్రెంచి ప్రభుత్వంతో, ఫ్రెంచి పెట్టుబడిదారీ వర్గంతో కుమ్మక్కై , తమ దేశాలలో ఉన్న అపారమైన సహజవనరుల నిల్వలను ఫ్రాన్స్ కొల్లగొట్టడానికి సహకరిస్తూ ఆ క్రమంలో స్వంతంగా ఆస్తులను విపరీతంగా పోగేసుకున్నారు. ఆ ప్రాంతంలో యురేనియం నిల్వలు అపారంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా అణువిద్యుత్ ప్లాంట్లలో జరుగుతుంది. వాటికి యురేనియం ముడిపదార్థం కావాలి. దానిని కొల్లగొట్టడానికి సహకరించి, ఆ క్రమంలో సంపాదించిన అపార ధనాన్ని ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడానికి వెదజల్లి అధికారం తిరిగి సంపాదించుకుంటున్న దేశాధినేతలు వాళ్ళు. "ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన" ఈ ప్రభుత్వాలకు విస్తృత ప్రజానీకపు మద్దతు ఏ మాత్రమూ లేదు. అవినీతి పద్ధతుల్లో అవినీతిపరులైన వ్యక్తులు ఎన్నికలను తారుమారు చేయడం ద్వారా అధికారంలోకి రాగలిగారే తప్ప ప్రజాభిమానం పొందడం ద్వారా కాదు.

మరో పక్క అక్కడి దేశాల సైన్యాలలో విప్లవకర భావాలుగలవారు, దేశభక్తులు గణనీయంగా ఉన్నారు. వారి సారథ్యంలో నైగర్‌లో జరిగిన "కుట్ర"కు దేశ ప్రజల నుండి విశేషమైన మద్దతు లభించింది. చివరికి పశ్చిమ దేశాల మీడియా నిర్వహించిన సర్వే కూడా నైగర్ ప్రజల్లో అత్యధిక శాతం ఫ్రెంచి సైన్యాలను వెళ్ళగొట్టాలనే అభిప్రాయాన్ని బలంగా సమర్థిస్తున్నారని తేల్చి చెప్పింది.

ఎన్నికల్లో మితిమీరిన అవినీతి పద్ధతులకు పాల్పడడం ప్రస్తుతం నైజీరియాలో మనకి కనిపిస్తోంది. అక్కడ దేశాధ్యక్షుడిగా ఉన్న బోలా టినుబు మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు, హవాలా లావాదేవీలకు సహకరించి ఆ క్రమంలో విపరీతంగా సంపాదించుకున్నాడు. అతగాడు అమెరికాలో ఉన్న కాలంలో ఆ అక్రమ వ్యాపారస్తులతో సంబంధాలు ఏర్పడ్డాయి. నైజీరియాకు తిరిగి వచ్చాక అక్కడి రాజకీయ నాయకులందరిలో తానే అత్యంత సంపన్నుడనని తెలుసుకుని, ఎన్నికల బరిలోకి దిగి డబ్బుతో ఓట్లు కొని దేశాధ్యక్షుడయ్యాడు. నైజీరియాలోని అమెరికన్ దౌత్య కార్యాలయంతో అనునిత్యం సంప్రదింపుల్లో ఉంటాడు. పొరుగుదేశం అయిన నైగర్‌లో కొత్త ప్రభుత్వం (సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే ప్రభుత్వం) ఏర్పడగానే ఏకపక్షంగా ఆ దేశానికి విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించాడు. ఇకోవాస్‌కు ఈ బోలా టినుబు ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్నాడు. ఆ పదవిని ఉపయోగించి తక్కిన దేశాలనన్నింటినీ నైగర్‌కు వ్యతిరేకంగా సమీకరించడానికి పూనుకున్నాడు. నైగర్‌లో బెజూమ్ ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పరచకుంటే తమ సంస్థ సైనిక చర్యకు సైతం పూనుకుంటుందని హెచ్చరించాడు.

కాని నైజీరియా లోని పరిస్థితులు ఎంత ఇబ్బందికరంగా ఉన్నాయంటే నైగర్‌లో సైనిక జోక్యం చేసుకోగల స్థితి నైజీరియాకు లేదు. పైగా గినీ, బుర్కినా ఫాసో, మాలి దేశాలు నైగర్‌లో గనుక ఇకోవాస్ జోక్యం చేసుకుంటే తమ దేశాల సైన్యాలు నైగర్ ప్రభుత్వానికి అండగా నిలబడతాయని హెచ్చరించారు. ఈ పరిస్థితి ప్రస్తుతం పశ్చిమ ఆఫ్రికాలో ఉన్న సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభుత్వాలకు అనుకూలంగా తయారైంది.

> ఆ ప్రాంతంలో యురేనియం నిల్వలు అపారంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా అణు విద్యుత్ ప్లాంట్లలో జరుగుతుంది. వాటికి యురేనియం ముడిపదార్థం కావాలి. దానిని కొల్లగొట్టడానికి సహకరించి, ఆ క్రమంలో సంపాదించిన అపార ధనాన్ని ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడానికి వెదజల్లి అధికారం తిరిగి సంపాదించుకుంటున్న దేశాధినేతలు వాళ్ళు. "ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన" ఈ ప్రభుత్వాలకు విస్తృత ప్రజానీకపు మద్దతు ఏ మాత్రమూ లేదు.

ఐనప్పటికీ, బోలా టినుబు, అతడికి అనుకూలంగా ఉన్న కూటమి నైగర్ సరిహద్దుల్లో సైన్యాలను మోహరిస్తున్నాయన్న వార్తలు వినవస్తున్నాయి. అంటే పశ్చిమ ఆఫ్రికాలో యుద్ధ వాతావరణం ఏర్పడుతోందన్నమాట. ఈ యుద్ధం ఒకవేళ జరిగితే అది సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ప్రతిఘటించే శక్తులకూ, సామ్రాజ్యవాదానికీ మధ్య యుద్ధంగా ఉంటుంది. ఇందులో సామ్రాజ్యవాద దేశాలు ప్రత్యక్షంగా దిగకపోయినా, తమ తొత్తుల ద్వారా పాల్గొంటున్నట్టు గుర్తించాలి. ఇది వలస దోపిడీ నుండి తమ దేశాలను విముక్తి చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను సైనిక పరమైన జోక్యంతో సామ్రాజ్యవాద శక్తులు దెబ్బ తీయడానికి చేస్తున్న కుట్ర. తాము స్వయంగా జోక్యం చేసుకోడం కన్నా తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇకోవాస్ ద్వారా కార్యం సాధించుకోవాలన్నదే సామ్రాజ్యవాదుల కుట్ర.

ఇక్కడ విశేషం ఏమంటే సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఎదిరిస్తున్న ప్రభుత్వాలు ఇప్పుడు రష్యా సహకారాన్ని కోరుతున్నాయి. గతంలో సోవియట్ యూనియన్‌గా ఉండిన కాలంలో తమ దేశాల్లో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు ఏ విధమైన సహకారం లభించిందో ఇప్పుడు గుర్తు చేస్తున్నాయి. కాని ఇప్పటి రష్యా వేరు, అప్పటి సోవియట్ యూనియన్ వేరు. అయినప్పటికీ ప్రస్తుతం రష్యా కూడా అమెరికన్ ఆధిపత్యాన్ని ఎదిరించి వ్యవహరిస్తోంది గనుక గత కాలపు పాత్రనే తమ విషయంలో పోషించాలని బుర్కినా ఫాసో, నైగర్ వగైరా దేశాలు అభిలషిస్తున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

★

కవిత్వం

రాళ్ళ భూమి


గుక్కెడు నీళ్లు రాళ్ళ సందుల్లో
ఇంకిపోతున్నాయి
విరిగిన విత్తు మధ్యలో చిగురు
పురిట్లోనే కన్నుమూసింది.
రాలిన నాలుగు చినుకులు
రాళ్ళపైనే పడి తడారిపోతుంటే
బిగుసుకున్న భూమి పొరల్లో
చెట్టు ఇరుక్కుపోయింది.
మట్టి గడ్డలు
మండే నిప్పు కణికలై ఎర్రబారుతుంటే
వాడిపోయిన ఆకు వేగంగా
గాలిలో కలిసిపోతూ
పురిటి గడ్డను మరిచిపోయింది.
సువిశాల బీడు నేలపై
నీటి గుర్రాలు పరిగెడుతుంటే
రంకె వేయాల్సిన పశువు
తల నేలకేసి దిగాలుగా పడుకుంది.
పొలం గట్లపై
నాట్యమాడాల్సిన నాగలి కర్ర
సాలీడు గూళ్ళ మధ్యలో
బిక్కుబిక్కుమంటూ చూస్తా
కాలం గడిపేస్తోంది.
గింజలు విదిలించాల్సిన కంకి
గువ్వలకు సైతం చులకనైపోతూ
ఒంటరిగా నిలబడే
కాలాన్ని క్షణం క్షణం లెక్కిస్తోంది.
రాళ్లురప్పల కింద కప్పబడిన నేల
కాసింత పసిమి ఆకుకై
ఎదురు చూస్తూ వుండిపోయింది
రాళ్ళ పాలనలో ఆ భూమి
చౌకబారు వేలం పాటకు
తాళం వేస్తూ కూర్చుంది.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్ : 9666016636

వ్యాఖ్య

ఆదాయపు పన్నుదారుల సంఖ్య పెరిగితే

దేశం వెలిగిపోతుందా?



> దేశంలో 90 శాతంగా ఉన్న పేదల నుంచి పరోక్ష పన్నుల రూపంలో (జిఎస్టీ ద్వారా) పెద్ద మొత్తంలో రాబట్టుకుని, కార్పొరేట్లకు ఏటా 12 లక్షల కోట్ల రాయితీలు, రుణ బకాయిల మాఫీ రూపంలో దోచిపెడుతోంది. ఈ వాస్తవాలను దాచి పెట్టి ఆదాయ పన్నుదారుల వల్లే సంపద పెరిగిపోతున్నట్లు చెప్పడం మోసపూరితం కాదా? ప్రజలకు నిజాలను చెప్పకపోతే చెప్పకపోవచ్చు. కానీ, అబద్ధాలను అర్ధ సత్యాలను ఇలా ప్రచారంలో పెట్టడం ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుంది.

పన్ను చెల్లింపుదారుల సగటు ఆదాయం రూ.13 లక్షలకు పెరిగిందంటూ ఎస్‌బిఐ రిసెర్చి విభాగం ఇటీవల ఇచ్చిన నివేదిక భారత దేశంలో అసంఖ్యాక ప్రజానీకం ఎదుర్కొంటున్న ఆర్థిక దుస్థితికి కొత్త ముసుగు తొడిగేలా ఉంది. ప్రభుత్వ గణాంక సంస్థలు, సర్వేలు వాస్తవాలను వెల్లడిస్తే వాటి అధిపతులపై ప్రభుత్వం వేటు వేస్తున్న స్థితిలో ఈ నివేదిక విశ్వసనీయత ఎంత అనేది పక్కన పెడితే, కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి ప్రచార బాకాలుగా మారిన మీడియాలోని ఒక సెక్షన్ ఈ నివేదికను చూపి దేశం వెలిగిపోతోందన్నట్లుగా సంబరపడిపోవడమే విచిత్రంగా ఉంది. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటే సరే అనుకోవచ్చు. కానీ, ప్రజల పక్షాన నిలవాల్సిన ఓ ప్రముఖ తెలుగు పత్రిక దీనికి బాకా పడితే ఎలా? ఇది ప్రజలను తప్పుదారి పట్టించడం కాదా? ఎస్‌బిఐ రిసెర్చి విభాగం నివేదిక అసమగ్రమైనది, పాక్షికమైనది. ఆర్థిక వ్యవస్థలో ఒక పార్శ్వాన్ని మాత్రమే అది చూపింది. ఇంకా అనేక పార్శ్వాలు ఉన్నాయి. అందునా ఆ నివేదికలో వచ్చే రెండు మూడేళ్లకు అంచనాలు వేస్తే అదొక రకం. కానీ, ఏకంగా 2047లో పరిస్థితి గురించి ఇప్పుడు అంచనాలు వేయడంలో హేతుబద్ధత ఏమిటి? 2014 మదింపు సంవత్సరంలో ఒక్కో ఆదాయపు పన్ను చెల్లింపుదారు సగటు వార్షికాదాయం 4.4 లక్షలు కాగా 2023 నాటికి అది 13 లక్షలకు చేరిందని, 2047 నాటికి అంటే స్వతంత్ర భారత్ వందేళ్ల పూర్తి చేసుకునే నాటికి 49.7 లక్షలకు చేరుతుందని ఆ నివేదిక అంచనా వేసింది. ఒక్కొక్కరి తలసరి ఆదాయం అప్పటికి 14 లక్షలకు చేరుతుందని కూడా జోస్యం చెప్పింది. అల్పాదాయ వర్గాలు ఎగువ ఆదాయ వర్గాల కేటగిరి లోకి చేరడం వల్ల ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని నివేదిక పేర్కొంది. ఈ లెక్కల కనికట్టుతో దేశ సంపద పెరిగిపోతుందన్న భ్రమలు కల్పించే యత్నం చేసింది. నిజానికి పెరిగిన ధరలతో పోల్చితే ప్రజల నిజ ఆదాయాలు పడిపోతున్నాయి. ఆకలి, పేదరికం, పోషకాహారం, డ్రాపవుట్లు, కొండలా పెరిగిపోతున్న అప్పుల మాటేమిటి?

2023 ప్రపంచ ఆకలి సూచీలో మొత్తం 136 దేశాల్లో భారత్ 127వ ర్యాంక్‌లో నిలిచింది. ఈ విషయంలో సబ్ సహరన్ ఆఫ్రికా దేశాల కన్నా వెనకబడి ఉంది. దేశంలో 58 శాతం మందికి ప్రధాన జీవనాధారంగా ఉన్న వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. రైతులు కనీస మద్దతు ధర లభించక ఆత్మహత్యలవైపు నెట్టబడుతున్నారు. భారత్‌లో పేదరికం 36 శాతం దాకా ఉందని ప్రపంచబ్యాంకు నివేదిక, పలువురు ఆర్థికవేత్తలు ఉద్ఘాటిస్తున్నారు. మనకన్నా రెండు సంవత్సరాలు ఆలస్యంగా స్వాతంత్ర్యం పొందిన చైనా 2021 ఫిబ్రవరి నాటికి పేదరికాన్ని పూర్తిగా పారదోలిన దేశంగా అవతరించింది.

దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. ప్రజల ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల పరం చేసే నయా ఉదారవాద విధానాలు అమలులోకి వచ్చిన ఈ మూడు దశాబ్దాల కాలంలో పాక్షిక ఉపాధే తప్ప పూర్తి స్థాయి ఉపాధి ఎక్కడా పెరిగిన దాఖలాలు లేవు. పోషకాహార లోపం, తలసరి కేలరీల లభ్యతలో భారత్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అట్టడుగున ఉంది. భారత్‌లో తలసరి కేలరీల వినియోగం 171 కిలోలు మాత్రమే. దక్షిణా ఫ్రికాలో ఇది 205 కిలోలు, చైనాలో 304 కిలోలు, రష్యాలో 407, అమెరికాలో 590 కిలోలుగా ఉంది. 2019-21 మధ్య ఆరోగ్య సూచీలో శిశు మరణాల రేటు, అయిదేళ్ల లోపు పిల్లలు బరువు తక్కువగా ఉండడం, రక్తహీనతతో 28 శాతం మంది ఇప్పటికీ బాధపడుతున్నట్లు సర్వేలో వెల్లడించినందుకు ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్)కు చెందిన డైరక్టర్‌ను ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తొలగించింది. భారత్ బహిరంగ మల విసర్జన రహిత దేశంగా మారిందని మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రకటనలోని డొల్లతనాన్ని బయటపెట్టినందుకు ఆ సంస్థ అధికారిపై వేటు వేసింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశాన్ని అప్పుల్లో ముంచేసింది. ఆ అప్పులకు వడ్డీ ప్రజల గోళ్లూడకొట్టి చెల్లించాల్సి వస్తుంది. అదీగాక దేశంలో 90 శాతంగా ఉన్న పేదల నుంచి పరోక్ష పన్నుల రూపంలో (జిఎస్టీ ద్వారా) పెద్ద మొత్తంలో రాబట్టుకుని, కార్పొరేట్లకు ఏటా 12 లక్షల కోట్ల రాయితీలు, రుణ బకాయిల మాఫీ రూపంలో దోచిపెడుతోంది. ఈ వాస్తవాలను దాచి పెట్టి ఆదాయ పన్నుదారుల వల్లే సంపద పెరిగిపోతున్నట్లు చెప్పడం మోసపూరితం కాదా? ప్రజలకు నిజాలను చెప్పకపోతే చెప్పకపోవచ్చు. కానీ, అబద్ధాలను అర్ధ సత్యాలను ఇలా ప్రచారంలో పెట్టడం ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుంది.

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)

జనవాక్యం

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో 34 చోట్ల సర్పంచ్‌లకు, 245 వార్డు సభ్యులకు ఇటీవల ఎన్నికలు జరగడం, అభ్యర్థులు పోటీ పడి లక్షలాది రూపాయలు ఖర్చు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఇదిలా వుండగా... రెండున్నర సంవత్సరాల క్రితం ఎన్నికైన సర్పంచ్‌లు నిధులు, విధులు లేక కనీసం వాలంటీర్‌కు ఉన్న విలువ లేక పంచాయతీ కార్యాలయాలకే వెళ్లకుండా మనోవేదన చెందుతున్నారు. ఇప్పుడు ఈ కొత్తగా ఎన్నికైన వారు ఏంచేస్తారో అయోమయంగా ఉంది. గ్రామ ప్రథమ పౌరుడుగా గతంలో హుందాగా ప్రజలు గౌరవించేవారు. ఇప్పుడు ఓరకంగా ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలుగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ఆశయాలను గౌరవించి సర్పంచ్‌లకు ప్రభుత్వం తగు గుర్తింపునివ్వాలి. ఆవిధమైన ఆదేశాలతో పాటు నిధులు సమకూర్చి ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు పాలనా పగ్గాలు ఇవ్వాలి.

- యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రాజ్యాంగ సంక్షోభం ముంగిట మణిపూర్?

• కేబినెట్ సిఫార్సును పట్టించుకోని గవర్నర్ • జరగని అసెంబ్లీ ప్రత్యేక సమావేశం • సుప్రీంకు గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులు

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెలకొన్న సంక్షోభ పరిస్థితులపై చర్చించేందుకు సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమవ్వాలని మంత్రివర్గం సిఫార్సు చేసినా ఆ రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయికే అనుమతించలేదు. దీంతో అసెంబ్లీ సమావేశం జరగలేదు. గవర్నర్ అనుమతినివ్వక పోవడంతో రాజ్‌భవన్ నోటిఫికేషన్ జారీ చేయలేదని అధికారులు తెలిపారు. మణిపూర్‌లో చెలరేగుతున్న జాతుల ఘర్షణపై చర్చించేందుకు వెంటనే శాసనసభను సమావేశపరచాలని ప్రతిపక్ష కాంగ్రెస్‌తోపాటు ఇతర జాతీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా గవర్నర్ సభ నిర్వహణకు అనుమతినివ్వకపోవడంపై కాంగ్రెస్ స్పందిస్తూ ఈ పరిస్థితి రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తుందని వ్యాఖ్యానించింది. ఆదివారం ఇంఫాల్‌లో పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత ఒక్రమ్ ఐబోబి సింగ్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు మాసాలకొకసారి అసెంబ్లీ సమావేశమవడం తప్పనిసరని అన్నారు. సాధారణ అసెంబ్లీ సమావేశానికి 15 రోజులు ముందుగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి వుంటుంది. గవర్నర్ కార్యాలయం అటువంటి నోటిఫికేషన్ ఏదీ ఇప్పటివరకు జారీ చేయలేదని అధికారులు చెప్పారు. ఈ నెల ఆరంభంలో కేబినెట్ సమావేశమైనప్పుడు 21వ తేదీ నుంచి 12వ మణిపూర్ అసెంబ్లీ నాలుగో సెషన్ సమావేశాలు జరపాల్సిందిగా సిఫార్సు చేసింది. ఈ మేరకు ఆగస్టు 4న అధికారిక ప్రకటన వెలువడింది. మార్చిలో అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఆ తర్వాత అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడింది. తదుపరి సమావేశాలు సెప్టెంబరు 2లోగా జరగాల్సి వుంది. లేనిపక్షంలో రాజ్యాంగ సంక్షోభం తప్పదని మరో అధికారి వ్యాఖ్యానించారు. ఈలోగా మే నుంచి హింస చెలరేగింది.





సమావేశాలకు రాలేం : కుకీ ఎంఎల్‌ఎలు

రాష్ట్రంలో చెలరేగుతున్న హింస కారణంగా తాము సమావేశానికి హాజరు కాలేమని 10మంది కుకీ ఎంఎల్‌ఎలు తెలియచేశారు. ఈ సమావేశాలకు దూరంగా వుండాల్సిందిగా నాగా కమ్యూనిటీకి చెందిన మరో 10మంది ఎంఎల్‌ఎలను యునైటెడ్ నాగా కౌన్సిల్ కోరింది.

సుప్రీంకోర్టుకు 3 నివేదికలు అందజేసిన గీతామిట్టల్ కమిటీ

ఘర్షణలు, హింస, కాల్పులు, గృహ దహనాల్లో ధ్వంసమైన వేలాది కీలక పత్రాలను తిరిగి రూపొందించి బాధితులకు సాధ్యమైనంత త్వరగా అందచేయాలని గీతామిట్టల్ కమిటీ సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు మూడు నివేదికలను అందచేసింది. మణిపూర్ ప్రజలు చట్టబద్ధ పాలన పట్ల తిరిగి విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన సూచనలు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఈ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కీలక పత్రాల పునర్నిర్మాణ బాధ్యతలను చేపట్టేందుకు నోడల్ అధికారిని నియమించాలని కమిటీ సూచించిందని నివేదికలను పరిశీలించిన తర్వాత చంద్రచూడ్ తెలిపారు. మణిపూర్ బాధిత నష్టపరిహార పథకం (ఎంవిసిఎస్)కి సంబంధించి కమిటీ రెండో నివేదికను అందజేసింది. ఆ పథకాన్ని ఇంకా గణనీయమైన రీతిలో మెరుగుపరచాల్సి వుందని కమిటీ అభిప్రాయపడిందని చంద్రచూడ్ చెప్పారు. బాధితులు మరో సంక్షేమ పథకంలో ప్రయోజనం పొందుతున్నట్లైతే వారు ఎంవిసిఎస్ కింద ప్రయోజనాలకు అర్హులు కాకపోవడాన్ని కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పరిమితులు, నిషేధం లేదని కోర్టు పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో, బాధితుడు మరో ఇతర పథకం కిందైనా ప్రయోజనం పొందుతున్నట్లైతే, ఈ పథకం కింద నష్టపరిహారాన్ని నిర్ణయించేటప్పుడు దాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటారని చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. దీనిపై విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.



రాజధానిలో మతోన్మాదుల వీరంగం

• చర్చి ధ్వంసం... క్రైస్తవులపై దాడి

న్యూఢిల్లీ : దేశ రాజధానిలో మతోన్మాదులు చెలరేగిపోయారు. ఇరవై మందికి పైగా దుండగులు ఆదివారం 'జై శ్రీరాం' అని నినాదాలు చేస్తూ తాహిర్‌పూర్ ప్రాంతంలోని చర్చిపై దాడి చేసి ధ్వంసం చేశారు. పలువురు క్రైస్తవులపై దాడికి తెగబడ్డారు. ఉదయం 10.40 గంటలకు చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో దుండగులు ఆదివారం చర్చిలోకి ప్రవేశించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పాస్టర్ సత్‌పాల్ భాటీ తెలియజేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ప్రకారం మతోన్మాదులు నినాదాలు చేస్తూ చర్చిలో ప్రవేశించారు. మహిళల సహా ప్రార్థనలు చేసుకుంటున్న క్రైస్తవులపై కర్రలతో దాడి చేశారు. జీసస్ చిత్రాలను సైతం ధ్వంసం చేశారు. బైబిల్ ప్రతులను చింపివేసేందుకు ప్రయత్నించారు. కొందరిని బయటికి లాగి చితకబాదారు. 'డెమొక్రసీ న్యూస్ ఇండియా' విడుదల చేసిన వీడియో ప్రకారం దుండగులు దాడిలో సంగీత వాయిద్యాలు కూడా ధ్వంసమయ్యాయి. కత్తితో డ్రమ్మును కోసేశారు. ఘటనపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించకపోతే ఎవ్వరైనా వచ్చి తమపై దాడి చేసే అవకాశం ఉన్నదని పాస్టర్ భాటీ చెప్పారు. బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారే తమపై దాడి చేశారని ఆయన తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు తాను మరో కొందరితో కలిసి జీటీబీ ఎన్‌క్లేవ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి సంస్థలకు చెందిన సుమారు వంద మంది అక్కడ చేరి 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేశారని వివరించారు. గత దశాబ్ద కాలంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు మాతృభూమిలోనే రక్షణ కరువైందని, బతికి బట్టకట్టే పరిస్థితి కన్పించడం లేదని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు చర్చి పైన, క్రైస్తవుల పైన దాడి చేశారంటూ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సంగ్రూర్‌లో పోలీసులకు రైతులకు మధ్య ఘర్షణ

• ఒక రైతు మృతి, నల్గురు పోలీసులకు గాయాలు

చండీగఢ్ : రైతులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సంగ్రూర్‌లో రైతులు సోమవారం పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ట్రాలీ ఢీ కొని ఒక రైతు మరణించాడు. నల్గురు పోలీసులు గాయపడ్డారు. వరదల్లో నష్టపోయినవారికి సాయం అందించాలని కోరుతూ ఆందోళనకు దిగిన కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కెఎంఎస్‌సి) నేతృత్వంలోని 16 యూనియన్లకు చెందిన రైతు నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సోమవారం తెల్లవారుజామున వీరిని అక్రమంగా అదుపులోకి తీసుకున్నారు. కెఎంఎస్‌సి రాష్ట్ర అధ్యక్షుడు శర్వణ్ సింగ్ పంథేర్, బికెయు (క్రాంతికారి) ప్రెస్ సెక్రటరీ బల్దీప్ సింగ్, కెఎంఎస్‌సి రాష్ట్ర ప్రెస్ సెక్రటరీ కన్వర్‌దిలీప్ సింగ్, బికెయు (బెహర్‌మేక్)కి చెందిన చంకౌర్ సింగ్, బర్త్ సింగ్‌లను అరెస్ట్ చేశారు. ఈ నిరసనకు సంబంధించి చండీగఢ్, పంజాబ్ పోలీసులకు, రైతు సంఘాలకు మధ్య ఆదివారం సుదీర్ఘ చర్చలు జరిగినా, విఫలమయ్యాయని రైతు నేత శర్వణ్‌సింగ్ పంథేర్ తెలిపారు. అనంతరం ఆదివారం రాత్రి పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్‌ను కూడా కలిశామని చెప్పారు. నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు పలువురు నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఈ అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌కెఎం కూడా ఈ అరెస్ట్‌లను ఖండించింది.

24న హోం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ భేటీ

• మూడు క్రిమినల్ బిల్లులపై మూడు రోజుల చర్చ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మొదటి సమావేశం ఈ నెల 24న జరగనుంది. ఇండియన్ పినల్ కోడ్ (ఐపిసి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిజర్ (సిఆర్‌పిఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ వంటి చట్టాలను మార్చుతూ తీసుకొచ్చిన మూడు బిల్లులపై మూడు రోజులు చర్చ జరగనుంది. అయితే ప్రతిపక్ష ఎంపిలు దీన్ని వ్యతిరేకించారు. గురువారం మధ్యాహ్నం కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా (బిఎస్) బిల్లులపై ప్రెజెంటేషన్‌లు ఇస్తారు. శనివారం మధ్యాహ్నం ముగుస్తుంది. ఈ నెల 11న లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లులను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ పరిశీలన కోసం కమిటీకి సూచించారు. 18న ప్రెజెంటేషన్‌ల షెడ్యూల్ గురించి ఎంపిలకు తెలియజేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తొలుత 16న జైలు పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముసాయిదా 245వ నివేదికను పరిశీలించి, చర్చించడానికి 24 ఉదయం సమావేశం గురించి ఎంపిలకు లేఖ అందిందని ఆయా వర్గాలు తెలిపాయి. కొత్త షెడ్యూల్‌పై ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపిలు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మూడు బిల్లులపై సమావేశాలను సెప్టెంబరుకు రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ టిఎంసి రాజ్యసభ ఎంపి డెరెక్ ఓబ్రెయిన్... స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ బ్రిజ్‌లాల్‌కు లేఖ రాశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఇటీవల ముగిశాయని, సభ్యులు తమ నియోజకవర్గంలో, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కార్యక్రమాలు, సమావేశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. చిక్కులతో కూడిన బిల్లులపై ఇంత స్వల్ప కాలంలో చర్చ సాధ్యం కాదని లేఖలో తెలిపారు. మణిపూర్‌పై చర్చ కోసం తాము ఇంతకుముందు ప్యానెల్‌ను సంప్రదించామని, ఎజెండాలో దాన్ని పెట్టలేదని ప్రతిపక్ష ఎంపిలు విమర్శించారు.

ఒపిఎస్ కోసం నేడు, రేపు సమ్మె

• అస్సాం ప్రభుత్వోద్యోగుల నిర్ణయం

అస్సాం : పాత పెన్షన్ స్కీమ్ (ఓపిఎస్)ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆల్ అస్సామ్ ప్రభుత్వ ఎన్‌పిఎస్ ఉద్యోగుల సంఘం (ఎఎజిఎన్‌పిఎస్ఇఎ) మంగళ, బుధ రెండురోజులపాటు సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రధానంగా నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్)ని రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎఎజిఎన్‌పిఎస్ఇఎ సంఘం అధ్యక్షులు అచ్యుతానంద హజారికా మాట్లాడుతూ.. '2005లో అమలు చేసిన ఈ ఎన్‌పిఎస్ పెన్షన్ విధానాన్ని అప్పటినుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నాం. ఈ విధానానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతూనే వున్నాం. రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా ఓపిఎస్ పునరుద్ధరించాలని హిమంత బిశ్వశర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం మా డిమాండ్‌పై స్పందించలేదు. ఎన్‌పిఎస్ అమలు వల్ల ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో నష్టపోతున్నారు. అదే ఓపిఎస్ అమలు చేస్తే.. ఉద్యోగుల పెన్షన్‌తోపాటు, రిటైర్‌మెంట్ అనంతరం వారి జీవితానికి భద్రత కలిగిస్తుంది. అందుకే ఓపిఎస్ పెన్షన్ స్కీమ్‌ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఓపిఎస్ అమలు చేయాలని ప్రతి జిల్లా కమిషనర్ కార్యాలయం ద్వారా ప్రధాన మంత్రి మోడీకి, ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మకి మెమొరాండం సమర్పిస్తామని అచ్యుతానంద పేర్కొన్నారు. రెండురోజులపాటు జరగనున్న ఈ సమ్మెకు ప్రధానంగా డిపార్ట్‌మెంట్ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆల్ అస్సాం డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ అస్సాం ట్రాన్స్‌పోర్ట్ ఎంపాయిస్ అసోసియేషన్, ఆల్ అస్సాం ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్, ఆల్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ మినిస్టీరియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపాయని తెలిపారు.

రాజ్యసభ సభ్యులుగా తొమ్మిదిమంది ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ సభ్యులుగా తొమ్మిది మంది ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం పార్లమెంటు హౌస్‌లోని రాజ్యసభ ఛాంబర్‌లో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వీరితో ప్రమాణం చేయించారు. రాజ్యసభ సభ్యులుగా కేంద్ర విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఇంగ్లీష్‌లో ప్రమాణస్వీకారం చేశారు. ఆయన 2019లో తొలిసారిగా ఎన్నికయ్యారు. జై శంకర్‌తోపాటు, ప్రమాణం చేసిన ఇతర బిజెపి సభ్యులు బాబూభాయ్ జెసంగ్‌భాయ్ దేశాయ్ (గుజరాత్), కేశ్రీదేవ్‌సింగ్ దిగ్విజయ్‌సింగ్ ఝాలా (గుజరాత్), నాగేంద్ర రే (పశ్చిమ బెంగాల్) ఉన్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఓబ్రియన్, డోలా సేన్, సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాష్ చిక్ బరైక్, సమీరుల్ ఇస్లాం ప్రమాణం చేశారు. ఓబ్రియన్, డోలా సేన్, సమీరుల్ ఇస్లాం, నాగేంద్ర రే బెంగాలీలో ప్రమాణం చేశారు. నాగేంద్ర రే, ప్రకాష్ చిక్ బరాక్, సమీరుల్ ఇస్లాం, కేశ్రీదేవ్‌సింగ్ దిగ్విజయ్‌సింగ్ ఝాలా, బాబూభాయ్ జెసంగ్‌భాయ్ దేశాయ్ కొత్తగా ఎన్నికయ్యారు. నలుగురు సభ్యులు బెంగాలీలో, ముగ్గురు హిందీలో, ఇద్దరు ఇంగ్లీషులో ప్రమాణం చేశారని రాజ్యసభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది.

మార్గదర్శకాలు రూపొందిస్తాం

• ప్రభుత్వ అధికారులకు సమన్ల జారీపై 'సుప్రీం'

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ అధికారులకు సమన్లు పంపేందుకు త్వరలో మార్గదర్శకాలను రూపొందించనున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం సోమవారం తెలిపింది. పెండింగ్‌లో ఉన్న కేసులు, తుది తీర్పుపై ధిక్కార కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా నిబంధనలు ఉండాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్ధివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు ధిక్కార కేసుల్లో అధికారుల హాజరు తప్పనిసరని, ప్రభుత్వ అధికారులను పిలిపించేందుకు కొన్ని మార్గదర్శకాలను రూపొందిస్తామని ధర్మాసనం తెలిపింది.

అమానుషం !

• స్నేహితుని కుమార్తెపై నెలల తరబడి అత్యాచారం
• మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతోద్యోగి సస్పెన్షన్‌కు ఢిల్లీ సిఎం ఆదేశాలు



న్యూఢిల్లీ : మహిళా, శిశు సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రేమోదయ్ ఖాఖా అమానవీయమైన చర్యకు పాల్పడ్డాడు. తన సంరక్షణలో వుంచిన తన స్నేహితుని కుమార్తెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2021లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ ప్రభుత్వ అధికారిని, ఈ నేరంలో పాలు పంచుకున్న ఆయన భార్యను ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సదరు అధికారి ఖాఖాను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేయాలంటూ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ఆదేశించారు. ఖాఖా స్నేహితుడు 2020 అక్టోబర్‌లో మరణించాడు. ఆయన 14 ఏళ్ల కుమార్తెకు ఖాఖా తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చాడు. అనంతరం అక్టోబర్ 2020 నుంచి 2021 జనవరి వరకు ఐదు నెలల్లో ఆ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆ అమ్మాయి గర్భం దాల్చింది. ఈ దారుణంలో ఖాఖా భార్య కూడా కుమ్మక్కైంది. అబార్షన్ జరిగేందుకు ఆ బాలికకు మాత్రల్ని ఇచ్చింది. తర్వాత ఆ అమ్మాయి 2021 జనవరిలో తన తల్లి దగ్గరికి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న ఆ అమ్మాయి భయాందోళనలతో వరుసగా పానిక్ అటాక్స్‌కు గురవుతోంది. తాజాగా స్టీఫెన్స్ ఆసుపత్రిలో చేరింది. ఆ నేపథ్యంలో ఆమెను ప్రశ్నించగా, లైంగిక వేధింపులకు, అత్యాచారానికి గురైనట్లు ఆ అమ్మాయి కౌన్సిలర్‌కి తెలిపింది.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

ఢిల్లీలో మైనర్ బాలికపై జరిగిన దారుణాన్ని జనవాదీ మహిళా సమితి (ఐద్వా) ఖండించింది. స్నేహితుడిపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేసి ఇంతటి హేయమైన చర్యకు పాల్పడడం సభ్య సమాజానికే సిగ్గుచేటని విమర్శించింది. ఆనాటి ఆందోళనకరమైన పరిస్థితులను గుర్తు తెచ్చుకుంటూ బాధితురాలికి తరచూ పానిక్ అటాక్స్ వస్తున్నాయంటే ఆమె పరిస్థితి అర్థమవుతోందని ఆ ప్రకటన పేర్కొంది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీసుకున్న చర్యను ఐద్వా స్వాగతించింది. తక్షణమే బాధితురాలి విద్యకు సాయమందించాలని, కౌన్సిలింగ్‌తోపాటు ఆమె వైద్య చికిత్సకయ్యే భారాన్ని భరించాలని ఐద్వా డిమాండ్ చేసింది. దోషులను కఠినంగా శిక్షించాలని కోరింది.

ఈక్వెడార్‌లో వామపక్ష అధ్యక్ష అభ్యర్థికి అత్యధిక ఓట్లు

క్విటో : ఈక్వెడార్‌లో సిటిజన్ రివల్యూషన్ మూమెంట్ (లెఫ్ట్)కి చెందిన లూయిసా గొంజాలెజ్ అత్యధిక ఓట్లు సాధించిన అధ్యక్ష అభ్యర్థిగా నిలిచారు. 43.92 శాతం చెల్లుబాటు ఓట్లలో లూయిసా గొంజాలెజ్ 33.44 శాతం ఓట్లతో ముందంజలో ఉన్నట్లు నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ (సిఎన్ఇ) తెలిపింది. ఆగస్టు 20 ఆదివారం నిర్వహించిన ముందస్తు ఎన్నికల వివరాలను సిఎన్ఇ వెల్లడించింది. యాక్షన్ డెమొక్రటిక్ నేషనల్ (ఎడిఎన్) రాజకీయ ఉద్యమానికి పిలుపునిచ్చిన యునైటెడ్ ఈక్వెడారియన్ పార్టీకి చెందిన మరో అభ్యర్థి డేనియల్ నొబోవా 24.31 శాతం ఓట్లను సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడు రాఫెల్ కొరియా మద్దతుదారుడైన లూయిసా గొంజాలెజ్ మాట్లాడారు. "మొదటిగా, మార్పు కోసం ఉద్యమించిన అన్ని పౌర సంఘాలకు, రెండు.. అసెంబ్లీ అభ్యర్థులందరికీ, మూడు.. ఈ దేశ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలియజేయాలనుకుంటున్నాను. మా ఆకాంక్ష, ప్రశంసలు ఎప్పుడూ ఈక్వెడారియన్ ప్రజలతోనే ఉంటాయి" అని అన్నారు.



భార్య, కుమారుడి కాల్చివేత అనంతరం ఆత్మహత్య

• అమెరికాలో ఇండియన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణచర్య

న్యూయార్క్ : అమెరికాలో భారతీయ దంపతులు, వారి ఆరేళ్ల కుమారుడు కాల్చివేతకు గురయ్యారు. కర్ణాటకకు చెందిన యోగేష్ నాగరాజప్ప (37), ఆయన భార్య ప్రతిభా అమర్‌నాథ్ (35), కుమారుడు యష్‌లు మేరీల్యాండ్‌లోని వారి నివాసంలో శవమై కనిపించారు. భార్య, కుమారుడిని కాల్చి చంపిన తర్వాత యోగేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. వీరు కర్ణాటకలోని దావంగెరె వాసులు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. బంధువులకు బాల్టిమోర్ కౌంటీ పోలీసులు సమాచారం అందించారు.

వెస్ట్ బ్యాంక్‌లో అక్రమ ఆవాసాల చట్టబద్ధీకరణకు ఇజ్రాయిల్ ప్రణాళిక

• ఖండించిన పాలస్తీనా

జెరూసలేం : వెస్ట్ బ్యాంక్‌లో అక్రమంగా నిర్మించిన 155 ఆవాసాలను చట్టబద్ధం చేసే ఇజ్రాయిల్ ప్రణాళికను పాలస్తీనా తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి రూపొందించిన ఈ ప్రణాళికను ఖండిస్తున్నామని, తీవ్రంగా తిరస్కరిస్తున్నామని పాలస్తీనా అధ్యక్ష ప్రతినిధి నబీల్ అబూ రుదెనెహ్ తెలిపారు. పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయిల్ ఇళ్లను నిర్మించడం అంతర్జాతీయ తీర్మానాల కింద చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 155 ఆవాసాలను చట్టబద్ధం చేయడం ద్వారా ఏరియా సి ని తమ నియంత్రణలోకి తీసుకునే ప్రణాళికను ఆర్థిక మంత్రి బాగా ప్రచారం చేస్తున్నారని ఇజ్రాయిల్ రేడియో తెలిపింది. ఏరియా సి అనేది వెస్ట్ బ్యాంక్‌లో అత్యంత వ్యూహాత్మకమైన, విస్తృత ప్రాంతం. మొత్తం భూభాగంలో దాదాపు 60శాతం ఇదే వుంటుంది. పాలస్తీనా భూభాగంపై నిర్మించిన ఏ ఇంటినీ చట్టబద్ధం చేసుకోవడంలో ఇజ్రాయిల్ విజయం సాధించలేదని అబూ రుదెనెహ్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి, కట్టిన ఇళ్ళన్నింటినీ తొలగించాల్సిన అవసరముందని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదించిన తీర్మానం పేర్కొంటోంది. ఇటువంటి ప్రమాదకరమైన నిర్ణయాల అమలును నిలుపు చేయాల్సిన బాధ్యత అమెరికాపైనే వుందని అబూ అన్నారు. పాలస్తీనా ప్రజలపై యుద్ధం సాగించేందుకు ఉద్దేశించిన ఈ విధానం మొత్తంగా ఈ ప్రాంతాన్ని హింస, అణచివేతల చక్రంలోకి నెడుతుందని విమర్శించారు. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంల్లో ఆరు లక్షల మందికి పైగా ఇజ్రాయిల్ సెటిలర్లు వున్నారు. అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నా వెస్ట్ బ్యాంక్‌పై నియంత్రణను ఇజ్రాయిల్ కొనసాగిస్తోంది.

కీలక అంశాలపై 'బ్రిక్స్' దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌డిబి ముఖ్య ఉద్దేశం. బ్రిక్స్ ఐదు సభ్య దేశాలు ఒకటికొకటి సహకరించుకోవడం, స్థానిక కరెన్సీలో వాణిజ్యం విస్తరించడానికి అంగీకరించాయి. గ్లోబల్ ట్రేడ్‌లో అమెరికన్ డాలర్ ప్రస్తుత మూల కరెన్సీ స్థానే స్థానిక కరెన్సీని ప్రోత్సహించడం ఒక మంచి పరిణామమని నిపుణులు అంటున్నారు. డి-డాలరైజేషన్ ప్రక్రియ అంతకంతకూ ఊపందుకుంటోంది.కొత్త కరెన్సీకి విస్తృతమైన చర్చలు, మార్పిడి రేట్లు, చెల్లింపు వ్యవస్థలు, ఆర్థిక మార్కెట్ నియంత్రణ కోసం యంత్రాంగాల ఏర్పాటు అవసరం. రాబోయే బ్రిక్స్ సమ్మిట్‌లో సీమాంతర వాణిజ్యం కోసం దీర్ఘకాలిక ఇంటిగ్రేటెడ్ పేమెంట్ సిస్టమ్‌కు సంబంధించి చర్చ జరిగే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేశారు.

బ్రిక్స్‌లో చేరటానికి ఇతర దేశాల ఆసక్తి

ఇటు బ్రిక్స్‌లో చేరటానికి అనేక దేశాలు ఆసక్తిని కనబరుస్తున్నాయి. 23 దేశాలు సమూహంలో చేరాలనే కోరికను వ్యక్తం చేయడంతో బ్రిక్స్ విస్తరణ అనేది మీడియా దృష్టిని చాలా ఆకర్షించే అంశం. ప్రస్తుత మందగమనం ఉన్నప్పటికీ, చైనా నేడు ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, కొనుగోలు శక్తి సమానత్వం(పీపీపీ) ప్రాతిపదికన మొదటిది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు ఎగుమతిదారుగా సౌదీ అరేబియా యొక్క ప్రత్యేక ప్రాముఖ్యత కారణంగా బహుశా దాని చేరిక జరిగే అవకాశం ఉండొచ్చని విశ్లేషకులు తెలిపారు. దీంతో బ్రిక్స్‌లోకి ఇతర దేశాలను చేర్చుకోవటం పైనా సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు తెలుపుతున్నారు.

'పశ్చిమ దేశాల'తో సమస్యలపై చర్చ

బ్రిక్స్ దేశాల అంతర్జాతీయ సంబంధాలను, ముఖ్యంగా పశ్చిమ దేశాలతో వారి తరచుగా సమస్యలు ఎదురవుతున్నందున, దీనిపై చర్చించడానికి ఇది అనువైన సమయం. అయితే, దీనికి ముందు, బ్రిక్స్ దేశాల మధ్యనే ఏవైనా అంతర్గత సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు, విశ్లేషకులు అన్నారు. సభ్య దేశాలు ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, శ్రేయస్సు లక్ష్యాలు వంటివి బ్రిక్స్ దేశాలు కొనసాగించాలని సూచించారు.






మీకోసం

రోల్డ్ గోల్డ్ నగలు పెట్టుకునేటప్పుడు వాటి వెనకభాగంలో ట్రాన్స్‌పరెంట్ గోళ్ల రంగు పూస్తే.. దురద, మంట రాదు.

జీవన సౌరభం

లక్ష్యం ఏర్పర్చుకోవడానికి సందర్భం అంటూ ఏమీ అవసరం లేదు. సంకల్పం ఉంటే చాలు.

బహుమతి




దసరా వస్తోందని స్కూలు పిల్లలందరూ చాలా సంతోషంగా ఉన్నారు. అప్పుడే ఎనిమిదవ తరగతిలోకి ప్రిన్సిపాల్ సార్ వచ్చారు. మాస్టారు క్లాసులోకి వస్తూనే.. 'హాయ్ పిల్లలూ... రేపటి నుండి మనకు దసరా సెలవులు. కాబట్టి మీరంతా జాగ్రత్తగా సెలవులను ఎంజాయ్ చేయండి. అమ్మమ్మ, నానమ్మల ఇంటికి వెళ్లి హాయిగా సెలవులు గడపండి. అక్కడి వాతావరణాన్ని బాగా గమనించండి. సెలవులు అయిపోయి స్కూలుకు వచ్చాక పండుగ ఎలా చేశారో, సెలవులను ఎలా గడిపారో తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ వ్యాసం రాయండి. వాటన్నింటినీ తెలుగు టీచర్‌కు ఇవ్వండి. బాగా రాసిన వారికి బహుమతులు ఉంటాయి' అని చెప్పారు. 'నవంబర్ 14న బాలల దినోత్సవం రోజున ఆ పిల్లలకు బహుమతులు అందజేస్తాం' అని కూడా అన్నారు.

మాస్టారు చెప్పిన విషయానికి పిల్లలంతా తెగ సంబరపడ్డారు. ఆ బహుమతులను తామే పొందాలని ఎవరికి వారే ఊహించుకున్నారు. సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్యల ఇండ్లకు వెళ్లారు. పచ్చని పంట పొలాలను ఆస్వాదించారు. ప్రకృతిలో పరవశించి ఆడారు. పిల్లలకు పల్లె వాతావరణం బాగా నచ్చింది. పక్షుల కిలకిల రావాలు, జంతువుల అరుపులు ఎంతో గమ్మత్తుగా అనిపించాయి. చూస్తుండగానే సెలవులన్నీ అయిపోయాయి. బడికి వచ్చాక, తాము చూసిన విషయాలను వ్యాసాలుగా రాసి టీచర్‌కి అందించారు. ఈ లోపు బాలల దినోత్సవం రానే వచ్చింది. వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులంటూ పిల్లలందరిలో ప్రకృతిని బాగా వర్ణిస్తూ రాసిన పదవ తరగతి విద్యార్థినికి ప్రథమ బహుమతి ఇచ్చారు.

'పిల్లలు ప్రకృతిని గమనించాలి.. ప్రకృతి మనకు ఎన్నో ఇచ్చింది. పర్యావరణాన్ని కాపాడడం మన బాధ్యత. ప్రకృతిని బాగా పరిశీలించిన మీరంతా ఇప్పటి నుండి పర్యావరణానికి హాని కలిగించే విషయాలపై శ్రద్ధపెట్టండి. వాటిని నియంత్రించేందుకు ప్రయత్నించండి.. మీతో పాటు మీ పెద్దలను కూడా పర్యావరణ రక్షకులుగా మార్చండి. అప్పుడే మనమంతా బాగుంటాం..' అని ప్రిన్సిపాల్ సార్ చేసిన ప్రసంగం పిల్లలందరికీ బాగా నచ్చింది.

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి..

నేను గీసిన బొమ్మ



చల్లా తేజస్విన్,
4వ తరగతి,
వివేకానంద హై స్కూల్,
పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా.



సమతుల ఆహారంతోనే రోగ నిరోధక శక్తి

వ్యాధి కారక క్రిములు విశృంఖలంగా సంచరించే కాలం వర్షాకాలం. చల్లటి వాతావరణం, పైగా వర్షాలు సూక్ష్మక్రిముల సంచారానికి అనువైనవి. కాబట్టే ఈ కాలంలో తేలికగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం. అయితే రోగ నిరోధక శక్తిని మెరుగ్గా ఉంచుకోగలిగితే వర్షాకాల రుగ్మతల నుంచి తేలికగానే తప్పించుకోవచ్చు. శారీరక, మానసిక శక్తులను కూడా పెంచుకోవాల్సివుంటుంది. చల్లటి వాతావరణం ప్రభావం మూలంగా వాత, పిత్త, కఫ స్వభావాలు వ్యక్తులను బట్టి విరుద్ధంగా స్పందిస్తూ ఉంటాయి. వ్యక్తుల తత్వాలు, రుతువులను బట్టి మారుతూ ఉంటాయి. కప తత్వ వ్యక్తుల్లో ఈ కాలంలో కపం పేరుకుపోయి ఉంటుంది. ఈ సమస్యను ఆయుర్వేద వైద్యంతో సరిచేయొచ్చు.

ఆహారం. జీవన శైలితోపాటు వ్యాధి నిరోధక శక్తిని ప్రభావితం చేసే అంశాలు అనేకం ఉంటాయి. వంశపారంపర్యం, రుతువు, మనుషుల ఆధారంగా వ్యాధి నిరోధక శక్తిలో మార్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆయుర్వేద చికిత్సతో వంశపారంపర్యంగా సంక్రమించిన, రుతువుల పరంగా హెచ్చుతగ్గులకు లోనయ్యే వయసు రీత్యా పెరిగి, తరిగే వ్యాధి నిరోధక శక్తిని సరిదిద్ది సంవత్సరం మొత్తం సమంగా ఉండేలా చేయొచ్చు. రుతువులను బట్టి జీవన దశలను బట్టి వ్యాధి నిరోధక శకిలో మార్పులు వస్తూ ఉంటాయి. సమగ్రమైన ఆయుర్వేద విధానాలను ఆచరించటం మూలంగా సమతుల్యమైన శాశ్వతమైన వ్యాధి నిరోధక శక్తిని పొందొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోంది. పని ఒత్తిడి, పెయిన్ మేనేజ్‌మెంట్, అధిక బరువు నియంత్రణ, గైనకాలజీ సమస్యలతోపాటుగా మాతృరక్ష, వామనం, విరేచనం, వాస్త, నస్యం, రక్తమోక్షనం, అర్థ్రైటిస్,



స్పాండిలైటిస్ వంటివి సులభంగా తగ్గించుకోవచ్చు.

ఆలస్యంగా తగ్గుతాయనేది అపోహ


సాధారణ వైద్య పద్ధతులతో పోలిస్తే ఆయుర్వేదంలో అనారోగ్య సమస్యలు చాలా ఆలస్యంగా తగ్గుతాయనే అపోహ ఉంది. ఇది నిజం కాదు. ఇంగ్లీషు మెడిసిన్‌తోపాటు ఆయుర్వేదం వైద్యంలో కూడా వేగంగా రోగాన్ని నయం చేయొచ్చు. త్వరగా తగ్గవని కొందరు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎక్కువ ఆయుర్వేదం వైద్యానికి వస్తుంటారు. ఆయుర్వేదం మందులు వాడితే వేడిచేస్తుందనే అపోహ కూడా ఉంది. ఇది నిజం కాదు. అది శరీరతత్వం, రోగ నిరోధక శక్తిని బట్టి ఉంటుంది. అంతే తప్ప వేడి చేస్తాయనేది అపోహ మాత్రమే. పూర్వకాలంలో మన పూర్వీకులు మన ఇంటి పరిసరాలు, వంటింట్లో ఉండే ఔషధాలను వాడే రోగాలను నియంత్రించుకునే వారు. ఇప్పుడు కూడా అలాగే చేయటం ద్వారా నయం చేసుకోవచ్చు. మన ఆహారంలో పండ్లు, తాజా కూరగాయలు, నెయ్యి, మజ్జిగ, నువ్వులు వంటివి తీసుకోవటం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. నెయ్యిలో ఇమ్యూనిటీని పెంచే గుణాలు ఉన్నాయి. తాజాగా ఉండే మజ్జిగ తాగటం కూడా ఎంతో మంచిది.

జీవన శైలిలో మార్పులు అవసరం

ప్రతిఒక్కరూ ఒక క్రమబద్ధమైన జీవిత శైలిని అలవర్చుకోవాలి. నియమబద్ధమైన అంటే సమతులమైన పౌష్టికాహారాన్ని తీసుకోవటం మంచిది. తద్వారా రోగ నిరోధక శక్తి (ఇమ్యూనిటీ పవర్) పెరుగుతుంది. కరోనా సమయంలోనూ, ఇతర వేవ్‌ల సమయంలోనూ వైరస్ నుండి సంరక్షించడంలో ఇమ్యూనిటీ ముఖ్య పాత్ర పోషించింది. విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవటం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం అవుతుంది. రోగనిరోధక శక్తి అనేక రకాల పోషకాలను కలిగి ఉంటుంది. విటమిన్ సి మాత్రమే కాకుండా మంచి ఆరోగ్యానికి అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరం.

వ్యాయామం అవసరం

ప్రతిఒక్కరూ నిద్ర, వ్యాయామం కోసం సమయం కేటాయించాలి. ఒత్తిడులకు దూరంగా ఉండాలి. తాజా పండ్లు, కూరగాయలు తినడం కూడా మంచిది. ఏడాది పొడవునా శరీరం చురుగ్గా ఉండాలంటే సూక్ష్మపోషకాలు చాలా అవసరం. అన్ని సూక్ష్మ పోషకాలు ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి. ఆహారంలో అవి తగినంతగా లేనప్పుడు రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. పాల ఉత్పత్తులు, మాంసాహార ఉత్పత్తులు, తృణధాన్యాలు, మిల్లెట్లను ఆహారంలో చేర్చుకోవాలి. శరీరానికి అవసరమైన పోషకాలను అందించాలి.



సూక్ష్మపోషకాలతో పాటు, ప్రతిరోజూ ఫైబర్, నీరు అధికంగా ఉండే ఆహారాన్ని తినడం సమతుల్య శారీరక శ్రమను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఉదయం నిద్ర లేచిన వెంటనే కాసేపు వ్యాయామం చేయాలి.

ఇమ్యూనిటీ పెంచే పదార్థాలు

- పాల ఆధారిత ఉత్పత్తులైన పాలు, జున్ను, పెరుగు, పాల పొడి
  సోయా పాలు, దాని ఉత్పత్తులు
- ప్రోబయోటిక్స్ సమృద్ధంగా ఉండే తృణధాన్యాలు, పోషకాహార పదార్థాలు
- విటమిన్ ఇ అధికంగా ఉండే ఆహారాలు
- బాదం, వేరుశెనగ , బాదం వంటి గింజలు
- పొద్దుతిరుగుడు విత్తనాలు,
- గోధుమగింజల చమురు, పొద్దుతిరుగుడు నూనె, సోయాబీన్ నూనె వంటి కూరగాయల నూనెలు
- బలపర్చిన (ఫోర్టిఫైడ్) ధాన్యపు అల్పాహారాలు
- జింక్ కలిగిన కింది ఆహారాల వంటివి
- పీతలు, ఎండ్రకాయల వంటి సముద్రాహారం (సీఫుడ్)
- ఎర్ర మాంసం, గుడ్లు, మాంసం
- చేప నూనె (ఫిష్ ఆయిల్)
- చియా విత్తనాలు, అవిసె గింజలు, ఆక్రోటు కాయలు వంటి గింజలు, ఫ్లాక్స్ సీడ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్
- తృణధాన్యాలు, రసాలను, పాలు, సోయా పానీయాలు వంటి ఫోర్టిఫైడ్ ఆహారాలు
- విటమిన్ ఎ సమృద్ధిగా ఉన్న ఆహారాలు
- మామిడి, ఆప్రికాట్లు వంటి పండ్లు

- డాక్టర్ కూరపాటి శ్రీనివాస్
అసోసియేట్ ప్రొఫెసర్, ఎండి, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, విజయవాడ.
చరవాణి : 9573724321



రామ్ చరణ్ కథను తెలుసుకున్నారు

బెన్నీ ముప్పానేని




జాతీయ పురస్కారం అందుకున్న 'కలర్ ఫోటో', 'తెల్లవారితే గురువారం' చిత్రాల తర్వాత లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన సినిమా 'బెదురులంక 2012'. కార్తికేయ గుమ్మకొండ, 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి జంటగా నటించారు. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సి. యువరాజ్ సమర్పకులు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెన్నీ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు... కథలో 'ఫియర్' (భయం) కూడా ఓ పాత్ర పోషిస్తుంది. అందుకని, 'బెదురులంక 2012' అని పెట్టాం. ఓ ఊహాజనిత గ్రామంలో 2012లో 21 రోజులు ఏం జరిగింది? అనేది కథ. మేం చెప్పాలనుకున్న కథను 2012 నేపథ్యం అవసరం. కథ వేరుగా ఉంటుంది. 100 పర్సెంట్ ఫోకస్ అంతా 2012 మీద ఉండదు. తనకు నచ్చినట్టు జీవించే పాత్రలో కార్తికేయ కనిపిస్తారు. అతడ్ని సమాజం ప్రశ్నిస్తూ ఉంటుంది. హీరో ప్రేయసి పాత్రలో నేహా శెట్టి కనిపిస్తారు. హీరో హీరోయిన్లు చిన్నప్పటి నుంచి ప్రేమలో ఉంటారు. సినిమాలో అన్ని పాత్రలకు క్యారెక్టర్ ఆర్క్ ఉంటుంది. మన మనసుకు నచ్చినట్లు 100 పర్సెంట్ బయటకు బతకం, చనిపోతాం అని తెలిస్తే చివరి క్షణాల్లో ఎలా ఉంటాం? అనేది సినిమా కోర్ పాయింట్. డ్రామా, కామెడీ సినిమాలో హైలెట్ అవుతాయి. సినిమాలో బోలెడు క్యారెక్టర్లు ఉన్నా సరే... కావాలని పెట్టినట్లు ఒక్క క్యారెక్టర్ కూడా ఉండదు. ట్రైలర్ విడుదల చేయడానికి ముందు రామ్ చరణ్ గారు కథ ఏంటని అడిగి తెలుసుకున్నారు. ట్రైలర్ చూసిన తర్వాత కాన్సెప్ట్ గురించి మాట్లాడారు. అజయ్ ఘోష్ క్యారెక్టర్ ఎంటరైన తర్వాత సీన్స్ గురించి చెప్పారు. మణిశర్మ మ్యూజిక్ చాలా బావుందన్నారు. ట్రైలర్ చూడటానికి ముందు కార్తికేయ, నేహా శెట్టి పెయిర్ బావుందని చెప్పారు.



ఈ క్షణాలు జీవితాంతం గుర్తుంటాయి

'ఈ రోజు ఇక్కడ ఉండటం నిజంగా గౌరవం. భారత సంస్కృతి, వారసత్వం ఎంత గొప్పదో మీరు నాకు అర్థమయ్యేలా చేశారు. ఈ రోజు నేను చూసిన క్షణాలు నా మదిలో జీవితాంతం గుర్తుంటాయి. ఈ అరుదైన గౌరవం నాకు దక్కేలా చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా కెరీర్‌లో నాకు మద్దతుగా నిలిచినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. నా ప్రతి చిత్రాన్ని ఎంతో ఆదరిస్తున్నందుకు అమెరికా ప్రజలకు కృతజ్ఞతలు' అని సమంత తెలిపారు. భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే పరేడ్‌లో పాల్గొన్న ఆమె పై వ్యాఖ్యలు చేశారు.

'చిత్తా'గా సిద్దార్ధ్



అరుణ్ కుమార్ దర్శకత్వంలో సిద్దార్థ్ హీరోగా తెరకెక్కుతున్న కొత్త చిత్రం 'చిత్తా'. ఈ సినిమాలో సిద్దు ఫస్ట్ లుక్ పోస్టర్‌ని, రిలీజ్ డేట్‌ని తాజాగా జయం రవి విడుదల చేశారు. ఈటాకీ ఎంటర్ టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ బ్యానర్‌పై ఉదయనిధి స్టాలిన్ విడుదల చేస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.

మూడో చిత్రానికి క్లాప్ కొట్టారు

నిర్మాత శిరీష్ తనయుడు ఆశిష్ హీరోగా తాజాగా మూడో సినిమా ప్రారంభమైంది. దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దిల్ రాజు కూతురు, అల్లుడు గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి ఎం ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. పిసి శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయనున్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా అవినాష్ కొల్ల వర్క్ చేస్తున్నారు. మూడో చిత్ర ప్రారంభ కార్యక్రమంలో ఆశిష్‌పై త్రివిక్రమ్ ఫస్ట్ క్లాప్ కొట్టారు. ఈ సినిమాని అరుణ్ అనే కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలవ్వనున్నట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే ఇవ్వనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.



'ఉపేంద్ర గాడి అడ్డా' ప్రారంభం



కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా, ఆర్యన్ సుభాన్ ఎస్.కె.దర్శకత్వంలో ఎస్ఎస్-ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న 'ఉపేంద్ర గాడి అడ్డా' చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అమీర్‌పేటలోని సంస్థ కార్యాలయలో పూజా కార్యక్రమాల అనంతరం హీరో హీరోయిన్లపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు క్లాప్ ఇచ్చారు. నిర్మాత సాయి వెంకట్ కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ 'మా స్వస్థలం విశాఖపట్నంలో మేము నెలకొల్పిన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. ఇక .హీరోగా నటిస్తున్న మా అబ్బాయితో వరుసగా తొమ్మిది సినిమాలు తీయాలని సంకల్పించాం. ఇప్పటికే నాలుగు సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇది మా బ్యానర్‌లో ఐదో సినిమా. చక్కటి కమర్షియల్ అంశాలతో కూడుకున్న మాస్ సినిమా ఇది. దర్శకుడు చెప్పిన స్క్రిప్ట్ నచ్చి, ఈ చిత్రం తీస్తున్నాం" అని అన్నారు.

శ్రేయస్, కెఎల్ రాహుల్‌కు చోటు

- స్థానాలు నిలబెట్టుకున్న బుమ్రా, తిలక్ వర్మ
- ధావన్, చాహల్‌కు దక్కని చోటు
- ఆసియాకప్‌కు 17మందితో జట్టును ప్రకటించిన సెలెక్షన్ కమిటీ



న్యూఢిల్లీ: ఆసియా కప్‌కు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్లు 17మందికి కూడిన జట్టును ప్రకటించారు. సోమవారం జరిగిన ఆసియాకప్‌కు జట్టు ఎంపిక సమావేశానికి హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ కూడా హాజరయ్యారు గాయాలబారినుంచి కోలుకున్న కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌తోపాటు విండీస్ పర్యటనలో రాణించిన హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ చోటు దక్కించుకున్నాడు. జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇక గాయాల బారినుంచి కోలుకున్న కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ తాజాగా జట్టులోకి పునరాగమనం చేయనున్నారు. ఇక వికెట్ కీపర్ సంజూ శాంసన్ బ్యాకప్ ప్లేయర్‌గా ఎంపికవ్వగా.. ఓపెనర్ల కోటాలో శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్‌లకు చోటు దక్కింది. ఈ క్రమంలో సీనియర్ బ్యాటర్ శిఖర్ ధావన్‌కు మరో సారి చోటు దక్కలేదు. అలాగే స్పిన్నర్ల కోటాలో కుల్దీప్‌కు చోటు దక్కగా.. సెలెక్టర్లు చాహల్‌కు మొండిచెయ్యి చూపారు. గతేడాది ఆసియా కప్‌ను టి20 ఫార్మాట్‌లో నిర్వహించగా.. ఈసారి యథాతథంగా వన్డేల తరహాలోనే ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ ఏడాది ఆసియాకప్‌ను శ్రీలంక, పాకిస్థాన్‌లు హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నారు. 30న ముల్తాన్ వేదికగా పాకిస్తాన్-నేపాల్ మధ్య జరిగే తొలిమ్యాచ్‌తో టోర్నీ ప్రారంభమై.. సెప్టెంబర్ 17న జరిగే ఫైనల్‌తో ముగియనుంది. భారత్ తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 2న పల్లెకెలె వేదికగా పాకిస్తాన్‌తో తొలి మ్యాచ్‌ను తలపడనుంది.

పటిష్టంగా టీమిండియా..

ఆసియా కప్ కోసం సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన భారత జట్టు పటిష్టంగా కనిపిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలతోపాటు ఆల్‌రౌండర్లతో టీమిండియా దుర్భేధ్యంగా ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, బుమ్రా, సిరాజ్ టీమిండియాకు ప్రధాన బలంగా కానున్నారు. అలాగే గాయాల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల కూడా ఈ టోర్నీ ఎంతో కీలకంగా మారనుంది. వీరంతా ఐసిసి వన్డే ప్రపంచకప్ కప్‌లో చోటు దక్కించుకోవాలంటే ఆసియా కప్‌లో తప్పక రాణించాల్సిన పరిస్థితి. ఇక తెలుగు తేజం తిలక్ వర్మను ఎంపిక చేయడంపై క్రికెట్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జట్టు: రోహిత్(కెప్టెన్), హార్దిక్(వైస్ కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), సూర్య కుమార్, జడేజా, అక్షర్,శార్దూల్, కుల్దీప్, సిరాజ్, బుమ్రా, షమీ. ప్రసిధ్, సంజు(బ్యాక్ అప్).

ఫైనల్‌కు ప్రజ్ఞానంద

- టైబ్రేక్‌లో కరువానాపై చిరస్మరణీయ విజయం
- టైటిల్‌కై కార్ల్‌సన్‌తో ఢీ




బాకు(అజర్‌బైజాన్): ఫిడే చెస్ ప్రపంచకప్‌లో 18ఏళ్ల రమేశ్‌బాబు ప్రజ్ఞానంద సంచలనం సృష్టించాడు. సోమవారం జరిగిన సెమీఫైనల్ టైబ్రేక్‌లో 3వ ర్యాంకర్ అమెరికాకు చెందిన ఫాబినో కరువానాపై ప్రజ్ఞానంద అద్భుత విజయాన్ని సొంతం చేసుకొని ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో తొలి రెండు గేమ్‌లు ముగిసే సరికి ఇరువురు 1-1పాయింట్లతో సమంగా నిలిచారు. ఆ తర్వాత జరిగిన టై బ్రేక్‌లలో ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. దీంతో ప్రజ్ఞానంద 3.5-2.5పాయింట్ల తేడాతో కరువానాను చిత్తుచేసి తొలిసారి చెస్ ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఫైనల్లో ప్రజ్ఞానంద టాప్‌సీడ్, నార్వేకు చెందిన మాగ్నస్ కార్ల్‌సన్‌తో టైటిల్‌కై తలపడనున్నాడు. 2024లో జరిగే క్యాండిడేట్ ఛాంపియన్‌షిప్‌కూ అర్హత సాధించాడు. ఫైనల్‌కు చేరిన ప్రజ్ఞానందకు ట్విటర్ వేదికగా భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ శుభాకాంక్షలు తెలిపాడు.

ప్రణయ్, లక్ష్యసేన్ శుభారంభం

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

కోపెన్‌హాగెన్(డెన్మార్క్): ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. సోమవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ ప్రత్యర్థులపై గెలిచి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న ప్రణయ్ 24-22, 21-10తో ఫిన్లాండ్‌కు చెందిన కలె కొల్జెనన్‌పై వరుససెట్లలో నెగ్గాడు. దీంతో ముఖాముఖి రికార్డునూ 3-0కు పెంచుకున్నాడు. మరో పోటీలో లక్ష్యసేన్ 21-12, 21-7తో జూలియన్ పాల్(మారిషస్)పై సునాయాసంగా విజయం సాధించాడు. ఇక నిరుడు కాంస్య పతకంతో సత్తా చాటిన భారత పురుషుల డబుల్స్ జోడీ ఈసారి స్వర్ణ పతకంపై కన్నేసింది. ఇప్పటివరకు మొత్తం 13 పతకాలు సాధించిన భారత్.. 1983లో ప్రకాశ్ పదుకొనే కాంస్య పతకం సాధించడంతో పతకాల వేటను మొదలుపెట్టింది.



100మీ. కొత్త చిరుత నో లైల్స్

ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

బుడాపెస్ట్: 100మీ. కొత్త చిరుతగా అమెరికాకు చెందిన నో లైల్స్ నిలిచాడు. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 100మీ. ఫైనల్లో గమ్యాన్ని 9.83సెకన్లలో చేరి స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్నాడు. ఇంతకుముందు 200మీ. పరుగులో స్వర్ణ పతకాన్ని చేజిక్కించుకున్న లైల్స్‌కు ఇది 100మీ. పరుగులో తొలి స్వర్ణం కావడం విశేషం. ఈ క్రమంలో లెట్సెల్లి టెబోగో(బోట్స్వానా), జర్నెల్ హ్యూజ్(బ్రిటన్) ఫొటో ఫినిష్‌లో 9.88సెకన్లతో రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అమెరికా స్ప్రింటర్ ఫ్రెడ్ కర్లె సెమీస్‌లో విఫలమై.. ఫైనల్‌కు చేరలేకపోయాడు. ఇక ఇటలీకి చెందిన ఒలింపిక్ ఛాంపియన్ లామెంట్ మర్సెల్ జాకోబ్స్ 10.05సెకన్లతో చివరిస్థానంలో నిలిచాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68